ఈనాడు
ఏలూరు
గురువారం అక్టోబరు 10, 2024 15

ముగ్గురిని మింగిన కాలువ

- పందెపు కోళ్లకు స్నానం చేయిస్తుండగా ప్రమాదం
- మృతులు తండ్రీ కొడుకులు

16లో

నేడు నీతి ఆయోగ్ బృందం పర్యటన

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: 'ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్' (ఏపీసీఎన్ఎఫ్)కు చెందిన నీతి ఆయోగ్ బృందం గురువారం జిల్లాలో పర్యటించనుంది. బృంద సభ్యులు ఉదయం 10.45 గంటలకు ఏలూరు మండలం వెంకటాపురం చేరుకుంటారు. 2 గంటల వరకు రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమవుతారు. ఆ తర్వాత వట్లూరులోని టీటీడీసీకి చేరుకుంటారు. అనంతరం ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకిస్తారు. అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ, జీఐజడ్‌తో కేర్ పరిశోధన ప్రాజెక్టు ద్వారా ఇప్పటి వరకు సాధించిన లక్ష్యాలు, ఫలితాలపై రైతులతో పరస్పర చర్చలో పాల్గొంటారు.

బాల్యం బలహీనం!

- వేధిస్తోన్న రక్తహీనత సమస్య
- వయసుకు తగిన బరువు లేని చిన్నారులు

నూజివీడు, న్యూస్‌టుడే:

- నూజివీడుకు చెందిన రెండేళ్ల బాలిక 8 కిలోల బరువు 75 సెం.మీ ఎత్తు ఉంది. వాస్తవానికి రెండేళ్ల వయసు ఉండే వారు 11 కిలోల బరువు 84.4 సెం.మీ ఎత్తు ఉండాలి. అదే బాలుడు అయితే 12 కిలోల బరువు, 85.6 సెం.మీ ఎత్తు ఉండాలి.
- ఏలూరుకు చెందిన నాలుగేళ్ల బాలిక 11.5 కిలోల బరువు మాత్రమే ఉంది. 14.2 కిలోలుండాలి. బాలుడు అయితే 15 కిలోలుండాలి


చిన్నారి బరువు చూస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

జిల్లాలో పరిస్థితి ఇలా...
అంగన్‌వాడీ కేంద్రాలు: 2,225
కేంద్రాల్లో నమోదైన చిన్నారులు

5 ఏళ్ల లోపు చిన్నారులు :	ఎత్తుకు తగ్గ బరువు లేని చిన్నారులు :
95,795	897

రక్తహీనత, పౌష్టికాహార లోపంతోనే ఆ పిల్లలందరూ బాధపడుతున్నారు. వీరే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీల్లో నమోదవుతున్న అనేక మంది చిన్నారులను ఇదే సమస్యలు వేధిస్తున్నాయి. అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లులు ముర్రుపాలు అందించలేని పరిస్థితులు ఉన్నాయి. దీంతో వారి రోగనిరోధక శక్తిపై ప్రభావం పడుతోందని వైద్యులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు తీసుకొస్తున్నా.. పలు లోపాలతో లక్ష్యాన్ని సమర్థవంతంగా చేరుకోలేకపోతున్నాయి. పీహెచ్‌సీల్లో గర్భిణులు తీసుకునే ఆహారం, ఇతర విషయాలపై సిబ్బంది అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని.. కేవలం ఐరన్ మాత్రలు ఇచ్చి సరిపెడుతున్నారని వాపోతున్నారు.

- 'గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత తగ్గించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ పనిచేస్తోంది. వైద్య పరీక్షలు తరచుగా నిర్వహిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. చిన్నారులకు సమతుల ఆహారం అందించాలి
  - డా.శర్మిష్ఠ, జిల్లా వైద్యాధికారిణి, ఏలూరు.
- చిన్నారులతో పాటు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలి. లోపాలున్న వారిని గుర్తించాం. వారి ఆరోగ్య స్థితిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం
  - పద్మావతి, ఐసీడీఎస్, పీడీ, ఏలూరు.

కర్షక పద్మాలు

16లో

ఎన్డీయే అభ్యర్థిని గెలిపించండి: మంత్రి


మాట్లాడుతున్న రామానాయుడు. చిత్రంలో విక్రమ్ కిశోర్, రామరాజు, వీరాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, గోవిందరావు, చిరంజీవి, పద్మశ్రీ, మురళి, రోషన్ కుమార్, ధర్మరాజు తదితరులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిని గెలిపించాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. స్థానిక ఓ హోటల్‌లో ఎన్డీయే ప్రజాప్రతినిధులు, నాయకులతో బుధవారం మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల నమోదు గడువు నవంబరు 6తో ముగియనుందన్నారు. తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు స్పందించి పట్టభద్రులంతా నమోదయ్యేలా చూడాలన్నారు. ఎన్డీయే అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేశారని పాత్రికేయులు అడగ్గా... దీనిపై అగ్ర నేతలు నిర్ణయం తీసుకుంటారని మంత్రి సమాధానమిచ్చారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పి.రాజశేఖర్‌ను ఎన్డీయే అభ్యర్థిగా బలపరిచే అవకాశం ఉందన్నారు.

బురద చల్లడమే జగన్ పని.. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటే నాటికే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని మంత్రి నిమ్మల తెలిపారు. దీన్ని సహించలేక జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. అయిదేళ్లలో రాష్ట్రాన్ని అథోగతి పాల్జేయడమే కాకుండా రూ.లక్షల కోట్లు అప్పు మిగిల్చారని దుయ్యబట్టారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బడేటి చంటి(ఏలూరు), పత్సమట్ల ధర్మరాజు(ఉంగుటూరు), సొంగా రోషన్‌కుమార్(చింతలపూడి), బొలిశెట్టి శ్రీనివాస్(తాడేపల్లిగూడెం), జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, తెదేపా ఏలూరు, పశ్చిమ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, రామరాజు, భాజపా జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిశోర్, ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు గోవిందరావు, తెదేపా నేత రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన ఏలూరు నియోజకవర్గ బాధ్యుడు రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోజుకు 54 ఇళ్లు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. గృహ నిర్మాణ సంస్థ అధికారులతో బుధవారం దూర దృశ్య సమావేశం నిర్వహించారు. వంద రోజుల కార్యాచరణలో భాగంగా రోజుకు కనీసం 54 ఇళ్లు నిర్మించాలని దిశానిర్దేశం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నాణ్యమైన సేవలందించాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక విడిది కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించారు. బేటీ బచావో- బేటీ పఢావో కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు అన్ని కేంద్రాల్లో మొక్కలు నాటాలన్నారు. ఉత్తమ పనితీరు కనబరిచే కార్యకర్తలు, పర్యవేక్షకులు, సీడీపీవోలకు ప్రశంసాపత్రాలు ఇస్తామని ఆమె పేర్కొన్నారు.

గంటకో మోసం..




- నూజివీడు ఉషాబాల నగర్‌కి చెందిన మందల్లి కమల జేసుదాసుకు ఈ నెల 2న ముంబయి పోలీసు విభాగం నుంచి మాట్లాడుతున్నామంటూ ఓ మహిళ వీడియో కాల్ చేసింది. మీకు పార్శిల్ వచ్చిందని, దానిలో నిషేధిత డ్రగ్స్ ఉన్నాయని చెప్పి భయపెట్టింది. దీనిపై విచారణ జరుగుతోందని, కొంత నగదు డిపాజిట్ చేయాలని, డ్రగ్స్‌తో సంబంధం లేదని తేలితే నగదు వెనక్కి ఇచ్చేస్తామని నమ్మించింది. దీంతో కమల జేసుదాసు మూడు దఫాలుగా రూ.40 లక్షలు బదిలీ చేశారు. చివరకు తాను మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.
- నారాయణపురానికి చెందిన ఉపాధ్యాయుడు గుదే శ్రీనివాసరావుకు గత నెల 24న ఓ వ్యక్తి సీబీఐ అధికారినంటూ వాట్సాప్ ద్వారా ఫోన్ చేశాడు. తన పేరు బల్వర్‌సింగ్ అని, దిల్లీ నుంచి మాట్లాడుతున్నానని చెప్పాడు. మీ కుమార్తె యుక్తా శ్రీజని డ్రగ్స్ కేసులో అరెస్ట్ చేసి చెన్నై నుంచి దిల్లీ తీసుకొస్తున్నామని, రూ.50 వేలు ఫోన్ పే చేస్తే తమ కుమార్తెను వదిలేస్తామని నమ్మబలికాడు. భయపడి శ్రీనివాసరావు తన కుమార్తెకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పగా చెన్నైలోని తాను పని చేసే కార్యాలయంలో ఉన్నట్లు తెలిపారు. కైకరానికి చెందిన బీమా సంస్థలో పని చేస్తున్న కూన అప్పారావుకి సైతం ఇదే మాదిరిగా వాట్సాప్ కాల్ చేశారు.

- పేట్రేగిపోతున్న సైబర్ నేరగాళ్లు
- నమ్మితే నట్టేట మునిగినట్టే

ఏలూరు, ఉంగుటూరు, న్యూస్‌టుడే:
సైబర్ నేరగాళ్లు రోజుకో రూపంలో పేట్రేగిపోతున్నారు. తాజాగా కొత్త పంథాలో మోసానికి తెరలేపారు. సీబీఐ, పోలీసు అధికారిలా ఫోన్ చేయడం...మీ వివరాలన్నీ చెప్పేస్తూ మీ కుమారుడు లేదా కుమార్తెను మాదక ద్రవ్యాల కేసులో అరెస్టు చేశాం...మీ పేరిట వచ్చిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయంటూ భయపెడతారు. నగదు ఇవ్వాలంటూ బెదిరిస్తారు. అందిన కాడికి నగదు కాజేస్తున్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన ఉదంతాలే అందుకు నిదర్శనం.

జిల్లాలో గత నాలుగేళ్లలో నమోదైన సైబర్ నేరాల సంఖ్య



ఫిర్యాదు ఇలా..

- సైబర్ నేరాల బారినపడ్డ బాధితులు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.
- కేంద్ర హోంశాఖ నిర్వహించే జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లోకి వెళ్లి ఫిర్యాదు చేయాలి.

పూటకో వేషం

అప్రమత్తతే శ్రీరామ రక్ష

సీబీఐ, పోలీసు, ఈడీ వంటి సంస్థల నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేస్తే కచ్చితంగా అనుమానించాలి. దేశంలో ఏ దర్యాప్తు సంస్థ కూడా వీడియో కాల్‌లో విచారణ చేయదు. మీకు ఫోన్ చేసి మీ పేరిట వచ్చిన పార్శిళ్లలో మాదక ద్రవ్యాలు ఉన్నాయని బెదిరించినా .. మీ కుటుంబ సభ్యులను మాదక ద్రవ్యాల కేసులో అరెస్టు చేశామని చెప్పినా నమ్మకూడదు. ఆలస్యం చేయకుండా ఆ ఫోన్ నంబరు.. వివరాలతో స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. అజ్ఞాత వ్యక్తుల నుంచి బ్యాంకుల పేరిట వచ్చిన లింక్స్, యాప్‌లు డౌన్‌లోడ్ చేయకూడదు.

ప్రత్యేక శిక్షణతో బృందం ఏర్పాటు

సైబర్ మోసాలపై ప్రజలు అవగాహన, అప్రమత్తతతో ఉండాలి. సైబర్ నేరాలను ఛేదించేందుకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ఓ బృందాన్ని ఏర్పాటు చేశాం. సైబర్ మోసాల బారిన పడిన బాధితులు ఆలస్యం చేయకుండా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.
-ప్రతాప్ శివకిశోర్, ఎస్పీ

2 విడతలుగా వరుసలుగా

త్వరలో జాతీయ రహదారి పనులు

జీలుగుమిల్లి-కొవ్వూరు మధ్య రెండు వరుసల రహదారి నిర్మాణంతో హైదరాబాద్ -రాజమహేంద్రవరం మధ్య దూరం తగ్గుతుంది.

కొయ్యలగూడెం గ్రామీణ, పోలవరం, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి-కొవ్వూరు వరకు ఎన్‌హెచ్ 365బీబీ జాతీయ రహదారి పనులు రెండు నెలల్లో ప్రారంభం కానున్నాయి. ఆర్అండ్‌బీ జాతీయ రహదారుల విభాగం అధికారులు వాటిని రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటివి ఏడాదిన్నరలో పూర్తి చేయాల్సి ఉంది. దీనిలో భాగంగా రెండు వరుసల రహదారి నిర్మాణానికి మూడు నెలల కిందటే టెండర్లు ఖరారయ్యాయి.

గుత్తేదారు సిద్ధం

జీలుగుమిల్లి-కొవ్వూరు మధ్య దూరం 87 కిలోమీటర్లు కాగా అందులో 40.4 కి.మీ.పనులు మొదటి ప్యాకేజీలో పూర్తిచేయాలని నిర్ణయించారు. భూసేకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనులు ప్రారంభించడానికి గుత్తేదారు సిద్ధంగా ఉన్నారని ఏఈ ఖాజాబాబు తెలిపారు.

365బీబీ రోడ్డు కథ ఇదీ

మొదటి విడత పనులు	40.4 కి.మీలు
మంజూరైన నిధులు	రూ.368 కోట్లు
భూసేకరణకు కేటాయించింది:	రూ.25.6 కోట్లు

మొదటి ప్యాకేజీ పనులు ఇలా..

జీలుగుమిల్లి నుంచి బుట్టాయగూడెం సమీపంలోని ఆసుపత్రి వరకు:	26 కి.మీలు
ఎల్ఎన్డీపేట బైపాస్ నుంచి పట్టిసీమ బాబా ఆలయం వరకు:	14.4 కిమీలు

చేపట్టనున్న నిర్మాణాలు

చిన్న వంతెనలు: 05 | కల్వర్టులు: 30

రెండో ప్యాకేజీలో: 46.3కి.మీలు | భూసేకరణకు: రూ.50 కోట్లు


దొండపూడి-సాగిపాడు మధ్య వంతెన నిర్మించనున్న ప్రాంతం

అయిదేళ్ల వరకు గుత్తేదారుదే బాధ్యత

మొదటి ప్యాకేజీ మినహా మిగిలిన భాగంలో కన్నాపురం-కొవ్వూరు వరకు ఇప్పటికే సింగిల్ లేయర్ బీటీతో అభివృద్ధి చేయడంతో ఆ పనులను రెండో ప్యాకేజీలో చేర్చారు. మరో అయిదేళ్ల వరకు నిర్వహణ బాధ్యత గుత్తేదారుదేనని, భూసేకరణతో పాటు రెండు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తామని సంబంధిత వర్గాలు తెలిపాయి. పట్టిసీమ నుంచి కన్నాపురం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మధ్య సింగిల్ రోడ్డు విస్తరణ జరిగితే అందరికీ ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు.

నగరాభివృద్ధికి సమష్టి కృషి

ముగ్గురు తెదేపా కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక


నూతన సభ్యులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూర్జహాన్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు నగరపాలక సంస్థకు ముగ్గురు తెదేపా కో-ఆప్షన్ సభ్యులను ఎంపిక చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మేయర్ నూర్జహాన్ అధ్యక్షత వహించారు. ఇటీవల మూడు కో-ఆప్షన్ పదవులు ఖాళీ కాగా, తెదేపా అభ్యర్థులుగా కొల్లేపల్లి రాజు, చోడే వెంకటరత్నం, జాలా సుమతి నామినేషన్లు వేశారు. వైకాపా నుంచి ఎవరూ నామపత్రాలు సమర్పించకపోవడంతో... వారి ఎన్నిక ఏకగ్రీవమైంది. వారితో మేయర్ ప్రమాణ స్వీకారం చేయించారు. వీరి నియామకాన్ని కౌన్సిల్ ఆమోదించింది. అనంతరం కో-ఆప్షన్ సభ్యులను మేయర్ అభినందించారు. నగరాభివృద్ధికి అందరి కృషి అవసరమన్నారు.

'టెట్'కు 327 మంది హాజరు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఏలూరు సమీప సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల కేంద్రంలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్షలు'(టెట్) కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 372 మందికి 327 మంది హాజరయ్యారని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు.

రొయ్య పిల్లకు వైరస్ కాటు!

- ఉభయ జిల్లాల్లో రూ.వందల కోట్ల నష్టం
- ప్రతికూల వాతావరణమే కారణం


వైరస్ ప్రభావంతో దెబ్బతిన్న రొయ్యలు

ఉండి, న్యూస్‌టుడే: వేసవిని తలపించే ఎండలు, ఉక్కపోత.. అంతలోనే కుండపోత వానలు.. ఇలా నిలకడలేని వాతావరణ పరిస్థితులు రొయ్యలు, చేపల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీంతో సాధారణ స్థాయికి పెరిగిన రొయ్యలు సైతం ఒత్తిడికిలోనై చెరువులోనే కళ్లు తేలేస్తున్నాయి. చెరువుల్లో వదిలిన రొయ్య పిల్లలు(సీడ్) వైరస్ బారిన పడి 60 శాతానికి మించి ఇప్పటికే తుడిచిపెట్టుకుపోయాయి.

అనూహ్య పరిణామాలు : ఉభయ జిల్లాల్లో సుమారు 1.20 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. జులై నుంచి మొదలైన అధిక వర్షాలు, వరదలు, ముంపు సమస్యతో చెరువుల్లో నీటి ఉష్ణోగ్రతల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీనికి కలుషిత జలాల సమస్య తోడవడంతో రొయ్యల చెరువుల్లో తెల్లమచ్చల వ్యాధి(వైట్ స్పాట్) విజృంభించింది. కొత్తగా వేసిన సీడ్ కూడా వైరస్ ప్రభావంతో చనిపోతోందని నిపుణులు నిర్ధారిస్తున్నారు. సీడ్ కొనుగోలు, రవాణా, మేత, విద్యుత్తు, నెల రోజుల పాటు యాజమాన్య ఖర్చులు లెక్కిస్తే ఎకరానికి సగటున రూ.1.50 లక్షల చొప్పున రైతులు పెట్టుబడి నష్టపోయారని చెబుతున్నారు. 60 శాతం చెరువుల్లో జరిగిన నష్టం రూ.750 కోట్లకు మించి ఉంటుందని అంచనా.

వర్షాలు తగ్గే వరకు ఆగండి : వర్షాలు కురుస్తున్నప్పుడు చెరువుల్లో మేత వినియోగాన్ని బాగా తగ్గించాలి. అమ్మోనియా, నైట్రేట్ వంటి విష వాయువులను గుర్తించేందుకు అవసరమైన నీటి పరీక్షలు చేయించి నిపుణుల సూచనల ప్రకారం యాజమాన్య చర్యలు తీసుకోవాలి. పీహెచ్ హెచ్చుతగ్గులను అరికట్టేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఎకరానికి ఒకట్రెండు బస్తాల చొప్పున వ్యవసాయ సున్నాన్ని చల్లాలి. వర్షాలు తగ్గిన తర్వాత కొత్తగా సాగు చేపడితే శీతాకాలంలో లాభదాయక ఉత్పత్తులు సాధించే అవకాశాలున్నాయి. – ఎన్.వీరభద్రరావు, మత్స్య శాస్త్రవేత్త

మీ కోసం ఆడిట్‌లో జిల్లాకు ప్రథమ స్థానం

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'(మీ కోసం) అర్జీల పరిష్కార రాష్ట్రవ్యాప్త ఆడిట్‌లో ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. 'మీ కోసం' వినతుల్లో 2,939 పరిష్కరించగా.. వాటిల్లో 2,895కి సంబంధించి అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. పరిష్కార తీరును ఆడిట్ నిర్వహించి 98.50 శాతంతో జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నట్లు నిర్ధారించారు. సంబంధిత అధికారికి పీజీఆర్ఎస్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా వినతులు పంపుతున్నారు. ఆ అధికారి క్షేత్ర స్థాయిలో పర్యటించి, అర్జీదారుడిని సంప్రదించి నాణ్యమైన పరిష్కారం లభించిందని అనుమతించిన తర్వాతే అర్జీని ముగిస్తున్నారు. జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంతో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి, ఏలూరు డీఎల్‌డీవో లక్ష్మీ, సంబంధిత సిబ్బందిని కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం అభినందించారు.

'దసరా' ప్రత్యేక రైళ్లు పొడిగింపు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: 'దసరా' పండగ సందర్భంగా నడుపుతోన్న ప్రత్యేక రైళ్లను వారం రోజులపాటు పొడిగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ- శ్రీకాకుళం రోడ్డు రైలును ఈ నెల 10, 11, 12, 14, 15, 16, 17 తేదీల్లో నడపనున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం రోడ్డు- విజయవాడ రైలును ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో తిప్పనున్నట్లు పేర్కొన్నారు. ఈ రైళ్లు ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరం, ద్వారకాపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతాయని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లాకు 3 టన్నుల రాయితీ టమాటాలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాకు మూడు టన్నుల రాయితీ టమాటాలు దిగుమతి అయ్యాయి. ఇందులో పత్తేబాద రైతు బజారుకు 1.50 టన్నులు, ఒకటో పట్టణ రైతు బజారుకు 750 కిలోలు, కైకలూరు రైతు బజారుకు 500 కిలోలు చొప్పున కేటాయించినట్లు మార్కెటింగ్ శాఖాధికారులు తెలిపారు.

పల్లెలు.. ప్రగతి వైపు అడుగులు!

ఈనెల 14 నుంచి 20వ వరకు అభివృద్ధి పండగ



ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : నిధులేక కునారిల్లుతున్న పంచాయతీలకు ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక నిధులిచ్చి సాంత్వన కలిగిస్తోంది. ఆగస్టు 23న ఒకే రోజు జిల్లాలోని 547 పంచాయతీల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఆమోదం పొందిన కీలక పనులకు శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20 వరకు పల్లె పండగ పేరుతో జిల్లాలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఎన్ఆర్‌జీఈఎస్(జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్) నిధులను ఈ నిర్మాణాలకు వినియోగించనున్నారు. దీనికి అదనంగా 15వ ఆర్థిక సంఘం, గిరిజన ఉప ప్రణాళిక నిధులు కూడా కేటాయిస్తున్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 1,862 పనులు చేపట్టేందుకు కలెక్టర్ పరిపాలనాపర ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వంలా కాకుండా పనులు చేపట్టే గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజలు, ప్రజాప్రతినిధులను భాగస్వాముల్ని చేయనున్నారు. మరింత పారదర్శకత, ప్రజల్లో జవాబుదారీతనం పెంచేందుకు అందరూ కలిసి పండగ వాతావరణంలో భూమి పూజ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఎక్కడెక్కడ సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు, బీటీ రోడ్లు, ఉద్యాన, గోకులాలు, ట్రెంచ్‌లు తదితర పనులు చేపట్టాలో మండలస్థాయిలోనే ఎంపీడీవోల ఆధ్వర్యంలో ఇప్పటికే గుర్తించారు.

చేపట్టే పనులు	మంజూరైన నిధులు
1,862	రూ.137.27

14న టెండర్లు

3,854కి చేరిన మద్యం దుకాణాల దరఖాస్తులు



ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల దరఖాస్తులకు బుధవారంతో గడువు ముగిసిపోగా... ప్రభుత్వం తాజాగా పొడిగించింది. 11 వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించింది. 14న దరఖాస్తులన్నింటినీ క్రోడీకరించి కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి టెండర్లు ఖరారు చేయనున్నారు. జిల్లాలో మొత్తం 144 దుకాణాలుండగా- బుధవారం నాటికి 3,854 దరఖాస్తులందాయి. రాష్ట్రంలోనే జిల్లా రెండో స్థానంలో ఉంది. 4 వేలకు పైగా దరఖాస్తులతో ఎన్టీఆర్ జిల్లా మొదటి స్థానంలో ఉంది. మరో రెండ్రోజులు గడువు ఉన్నందున... జిల్లాలో మరో వెయ్యి దరఖాస్తులు అదనంగా అందే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎక్సైజ్ స్టేషన్	దుకాణాలు	దరఖాస్తులు
ఏలూరు	41	301
చింతలపూడి	16	578
భీమడోలు	22	854
పోలవరం	12	473
జంగారెడ్డిగూడెం	16	736
నూజివీడు	16	500
కైకలూరు	21	412

నల్ల బజారులో సర్కారీ మద్యం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ దుకాణాల్లో మద్యం సరిపడా లేదు. రూ.130, రూ.150, రూ.180కు లభించే సరకు అందుబాటులో లేదు. అధికశాతం దుకాణాల్లో రూ.250కు లభ్యమయ్యే సీసాలు మాత్రమే లభ్యమవుతున్నాయి. రూ.130- రూ.180 మధ్య ధర ఉండే మద్యం ప్రభుత్వ దుకాణాల్లో దొరక్కపోయినా గ్రామాలు, వార్డుల్లో ప్రైవేటు వ్యాపారుల వద్ద లభ్యమవుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చాలా దుకాణాల్లో సరకు సరిపడా ఉండటం లేదని.. ఎందుకు లేదని అడిగితే.. గతంలో ఉన్న సరకు ఇక రాదని, పాత నిల్వలు అయిపోవడంతో కొన్ని రకాలు అందుబాటులో లేవంటూ సిబ్బంది మాట దాటవేస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు.

మండవల్లి చిన్నారి ప్రతిభ

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



ప్రశంసాపత్రం, బంగారు పతకంతో చిన్నారి శ్రేష్ఠన్విత


మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం ఆనందపురం గ్రామానికి చెందిన నాలుగేళ్ల శ్రేష్ఠన్విత ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది. ఇంగ్లిష్ అక్షరాలను వరుస క్రమంలో అత్యంత వేగంగా కేవలం 13.16 సెకన్లలోనే పఠించినందుకు రికార్డును సొంతం చేసుకుంది. శ్రేష్ఠన్విత తల్లి బుంగా ప్రమీల మహిళా పోలీసుగా, తండ్రి ఇంటి పవన్‌కుమార్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. కైకలూరు ఓ ప్రైవేటు పాఠశాలలో యూకేజీ చదువుతున్న శ్రేష్ఠన్విత బహు ప్రతిభావంతురాలు. నృత్యం, గానం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో చురుగ్గా పాల్గొంటుంది. తల్లిదండ్రులు పనిలో ఎంత ఒత్తిడి ఉన్న చిన్నారి ప్రతిభను గుర్తించి ప్రత్యేకంగా తర్ఫీదు ఇప్పించారు. ఏదైనా విషయాన్ని వెంటనే నేర్చుకోవడం, గుర్తు పెట్టుకోవడం పరిపాటిగా మారింది. దీంతో తల్లి ప్రమీల ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కి చిన్నారి వీడియోలను పంపింది. వేగంగా అక్షరాలను చెప్పిన ఘనతతో మంగళవారం చిన్నారికి ప్రత్యేక రికార్డు ప్రశంసాపత్రంతో పాటు బంగారు పతకాన్ని పంపారు. ఘనత సాధించిన చిన్నారిని గ్రామస్థులు, నాయకులు ప్రశంసిస్తున్నారు.

రేపు అంత్యోదయ దివస్

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: తపాలా వారోత్సవాల్లో భాగంగా గురువారం అంత్యోదయ దివస్ నిర్వహిస్తున్నట్లు ఏలూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్(ఎస్పీ) ఎస్.శ్రీకర్‌బాబు తెలిపారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, ఎన్.ఆర్.పేట, వెంకట్రావుపేట, చేబ్రోలు, చింతలపూడి, జీలుగుమిల్లి తపాలా కార్యాలయల్లో ఆధార్ శిబిరం(ఆధార్ నమోదు, నవీకరణ) నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటలకు శిబిరం ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ఎన్నాళ్లు.. ఈ కన్నీళ్లు!

పాలకొల్లు, న్యూస్‌టుడే



● జంగారెడ్డిగూడెంకు చెందిన వృద్ధ దంపతులు ఆరుగురు సంతానాన్ని పెంచి పోషించారు. వయసు మీదపడి ఇప్పుడు వారికి ఓపిక తగ్గిన తరుణంలో ఒక్కరూ వారిని చూసుకునే బాధ్యత తీసుకోలేకపోయారు. రెక్కలొచ్చిన పక్షుల్లా జీవితంలో స్థిరపడిన వారసులు బయటకు వెళ్లిపోవడంతో పూర్వ ఇళ్లలోనే చాలామంది వృద్ధులు ఆఖరి రోజులను భారంగా వెళ్లదీస్తున్నారు.

● వయోభారంతో ఉన్న తన పోషణను కుమారుడు పట్టించుకోవడం లేదని భీమవరం మండలం రాయలంక చెందిన ఆంజనేయులు సెప్టెంబర్ 24న భీమవరంలో కలెక్టర్‌కు అర్జీ అందించారు. బాల్యంలో మనల్ని బాధ్యతగా చూసిన తండ్రిని వృద్ధాప్యంలో చూసుకోవలసిన బాధ్యత మనపై ఉందనే మానసిక పరిపక్వత నేటితరంలోని కొందరికి కరువవ్వడంతోనే ఇటువంటి పరిస్థితులు తలెత్తుతున్నాయి.

● ప్రస్తుతం తల్లిదండ్రులను చూసుకునేందుకు కొందరు తనయులు వంతులవారీ విధానం అమలు చేస్తున్నారు. భీమవరం పట్టణంలోని గునుపూడికి చెందిన సూర్యావతి వాపోతున్నారు. ఇద్దరు కుమారుల్లో ఒకరికి వంతు వచ్చినపుడు తన పోషణ చూడటం లేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇంకొందరైతే తల్లిని ఒకరు తండ్రిని మరొకరు చూసే కార్యక్రమాలకు ఒడిగడుతున్నారంటే ఆశ్చర్యం కాదు.

నిరాదరణతో కుంగిపోతున్న తల్లిదండ్రులు

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

పెద్దవయసులో చిన్నతనం..

ఇలాంటివన్నీ వృద్ధుల్లో మానసిక సమస్యలకు మూలం అవుతున్నాయి. విశ్రాంత వయసు వచ్చాక పిల్లల నుంచి పోషణ సరిగా లేకపోవడంతో చాలామంది కుంగుబాటుకు గురవుతున్నారు. ఇదే విషయాన్ని ఎవరికైనా చెప్పుకున్నా చిన్నతనంగా ఉంటుందని భావించి కొందరు తల్లిదండ్రులు నోరు మెదపక వారిలో వారే మానసిక సంఘర్షణకు గురవుతున్నారు. భార్యాభర్తలుంటే వృద్ధాప్యంలో ఎదురయ్యే కష్టాలను ఒకరికొకరు పంచుకుని కొంత స్థైర్యంగా ఉంటున్నారు. పోషణలో నిరాదరణకు గురవుతున్న భార్యాభర్తల్లో ఏ ఒక్కరూ చనిపోయినా మిగిలిన ఒక్కరి వేదన వర్ణనాతీతం. పిల్లలకు దూరంగా ఉండలేక ఒంటరితనం భరించలేక వృద్ధాప్యంలో బలవన్మరణాలకు పాల్పడుతున్నవారు లేకపోలేదు.

సానుకూలతతోనే..

ఒంటరితనం, నిరాదరణ వంటి కారణాలు వృద్ధుల్లో మానసిక సమస్యలకు దారితీస్తున్నాయి. దీనికి శారీరక సమస్యలు కూడా తోడవడంతో మరింత కుంగుబాటుకు గురవుతున్నారు. మనం మన తల్లిదండ్రులను ఎలా చూస్తామో భవిష్యత్తులో మన పిల్లలు కూడా దాదాపు అలాగే ప్రవర్తిస్తారనే విషయాన్ని అందరూ గ్రహించాలి. వృద్ధుల మంచి చెడులు చూసుకోవడం తమ బాధ్యతగా పిల్లలు గుర్తిస్తే వారిని ఆనందంగా, ఆరోగ్యం ఉంచొచ్చు. - **అక్కింశెట్టి రాంబాబు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, తణుకు.**

కర్షక పద్మాలు





ఆ మహిళలు ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నారు. అయినా ఆత్మస్థైర్యం కోల్పోలేదు. ఓవైపు పిల్లల్ని చూస్తూ.. మరోవైపు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సేంద్రియ సాగు బాట పట్టారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో లాభాలు పొందుతూ స్ఫూర్తిబాటలో పయనిస్తున్నారు. - **న్యూస్‌టుడే, నూజివీడు**

మహిళా రైతుల విజయగాథ

అన్నే పద్మావతి భర్త చనిపోయారు. ఇద్దరు కుమారులకు వివాహాలు అయ్యాయి. ఆమె డిగ్రీ చదువుకున్నారు. వ్యవసాయంపై మక్కువతో ఇజ్రాయెల్, దక్షిణాఫ్రికా, మలేసియా, శ్రీలంక దేశాలకు వెళ్లి అక్కడి పద్ధతులను పరిశీలించారు. నూజివీడు మండలం రావిచర్ల, ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో 2018 నుంచి 4 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో మామిడి, అల్లం, బంగాళదుంప, బొప్పాయి, బత్తాయి, డ్రాగన్, దానిమ్మ, సీతాఫలం, యాపిల్‌బేర్, పైనాపిల్ పండిస్తున్నారు. అంతర పంటలుగా కూరగాయలు, బంతి, చామంతి, కనకాంబరం సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల కిందట హైదరాబాద్‌లో అప్పటి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు నుంచి రైతునేస్తం పురస్కారం అందుకున్నారు.

దిగుబడులు ఆశాజనకంగా.. గత ఏడాది ఎకరాకు డ్రాగన్ సుమారు 10 టన్నుల దిగుబడి వచ్చింది. ఖర్చులు మినహా సుమారు రూ.5 లక్షల లాభం వచ్చింది. బొప్పాయి 12 నుంచి 15 టన్నుల దిగుబడి వచ్చింది. పెట్టుబడి లక్ష వరకు అయ్యింది. లాభం రూ.లక్ష వచ్చింది. - **అన్నే పద్మావతి.**



ఆగిరిపల్లికి చెందిన మాదల పద్మావతి భర్త చనిపోయారు. కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. పద్మావతి సుమారు 10 ఏళ్ల నుంచి 8 ఎకరాల్లో 21 రకాల పండ్లను, ఎకరన్నరలో బెండ, బీర, వంగ, మిర్చి, సొర, పొట్ల, బీన్స్, టమోటా కూరగాయలను సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్నారు. 5 ఎకరాల్లో సాధారణ మామిడి, ఒక ఎకరంలో హైడెన్సిటీ పద్ధతిలో మామిడి(తక్కువ భూమిలో ఎక్కువ మొక్కలు) సాగు చేస్తున్నారు. గతంలో కలెక్టర్, ఇతర దేశాల నుంచి వచ్చిన అధికారులు పరిశీలించారు. 'సేంద్రియ వ్యవసాయంతో కొంత మందికి ఉపాధి కల్పించాలని, ప్రజలకు ఎరువులు, పురుగు మందులు వాడకుండా అందరికీ సంపూర్ణ ఆరోగ్యంతో కూడిన ఆహారాన్ని అందించాలన్నదే ధ్యేయం' అని మాదల పద్మావతి చెబుతున్నారు.

22 నుంచి రోలర్ స్కేటింగ్ ఎంపికలు

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: స్థానిక ఇండోర్ మైదానంలో ఈ నెల 22 నుంచి రెండ్రోజుల పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి ఆర్ఎస్ఎఫ్ఐ, ఏపీఆర్ఎస్ఏ రోలర్ స్కేటింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.రమేష్ తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు కాకినాడలో జరుగనున్న 36వ రాష్ట్ర రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఔత్సాహిక క్రీడాకారులు 20లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 84568 23723 నంబరును సంప్రదించాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ

ఏలూరు (గ్రామీణ, న్యూస్‌టుడే): సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్సీ పరీక్షకు 5050 మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ సంయుక్త సంచాలకుడు వి.జయప్రకాశ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన శిక్షణ సంస్థల్లో, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ కేంద్రాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఎంప్యానెల్‌మెంట్‌కు ఆసక్తి ఉన్న సంస్థలు ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

శస్త్రచికిత్స చేయించుకున్న మహిళకు ఇన్‌ఫెక్షన్

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: స్థానిక సర్వజన ఆసుపత్రిలో రెణ్నెల్ల క్రితం కడుపు నొప్పితో బాధపడుతున్న ఓ మహిళకు వైద్యులు శస్త్రచికిత్స చేశారు. కొన్నాళ్లకే ఆమె ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు బుధవారం ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధితుల కథనం మేరకు... మాదేపల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన ఉమా భారతికి గర్భసంచిలో ఇబ్బంది ఉండటంతో జులై 24న ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేరారు. 27న శస్త్రచికిత్స చేసి ఆగస్టు 5న డిశ్చార్జి చేశారు. కొన్నాళ్లకు శస్త్రచికిత్స చేసిన చోట ఇన్‌ఫెక్షన్ వచ్చింది. ఈ విషయాన్ని శస్త్రచికిత్స చేసిన డాక్టర్ దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా... ఆయన పట్టించుకోలేదు. దాంతో బాధితురాలితో సహా కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి పర్యవేక్షకుడు సుధాకర్ మరో డాక్టర్‌తో వైద్యం చేయిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

'పల్లె పండగ'ను విజయవంతం చేయాలి: కలెక్టర్



మాట్లాడుతున్న వెట్రిసెల్వి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 14 నుంచి జరగనున్న పల్లె పండగ వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక విడిది కార్యాలయం నుంచి అధికారులతో బుధవారం దూర దృశ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు ఏడాదిలో కనీసం వంద రోజులపాటు ఉపాధి పనులు కల్పించాలన్నారు. గ్రామాల్లో మరింత పారదర్శకత, ప్రజల్లో జవాబుదారీతనం పెంచేందుకు పండగ వాతావరణంలో భూమి పూజ చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి సహకరించాలని చెప్పారు.

పకడ్బందీగా వయోవృద్ధుల సంక్షేమ చట్టం అమలు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: వయో వృద్ధుల సంక్షేమ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టర్ విడిది కార్యాలయం నుంచి చట్టం అమలుపై అధికారులతో బుధవారం దృశ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. వయో వృద్ధుల సంక్షేమ చట్టాన్ని ప్రభుత్వం 2007లో అమల్లోకి తెచ్చిందన్నారు. 2011, 2012ల్లో చట్టాన్ని మరింత పటిష్ఠం చేసిందన్నారు. వయో వృద్ధుల అభివృద్ధి, వారి సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. డీఆర్వో పుష్పమణి, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ బి.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిని మింగిన కాలువ

● పందెం కోళ్లను ఈత కొట్టిస్తుండగా ప్రమాదం ● మృతులు తండ్రీకొడుకులు ● పెదవేగి మండలం కవ్వగుంటలో విషాదం



భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య దేవి(నల్లచీర ధరించిన మహిళ)

పెదవేగి, న్యూస్‌టుడే : పెదవేగి మండలం కవ్వగుంటలో విషాదం అలుముకుంది. ప్రమాదవశాత్తూ పోలవరం కుడికాలువలో పడి ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, ఇద్దరు కుమారులు మరణించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శెట్టిపల్లి వెంకటేశ్వరరావు కూలి పనులతోపాటు పాల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అతనికి భార్య దేవి, మణికంఠ, సాయికుమార్ ఇద్దరు కుమారులున్నారు. కుమారులు పెదవేగిలోని ఒక పాఠశాలలో 9, 7వ తరగతులు చదువుతున్నారు. వీరు తాము పెంచుకుంటున్న పందెపు కోళ్లను బుధవారం కుడికాలువలోకి ఈత నేర్పేందుకు తీసుకువెళ్లారు. చిన్న కుమారుడు శెట్టిపల్లి సాయికుమార్(13) కోడి పుంజును తీసుకొని నీళ్లలో వదిలే క్రమంలో జారి కాలువలో పడిపోయాడు. ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో ఒక్కసారిగా మునిగిపోయాడు. గట్టుపై ఉన్న అన్న మణికంఠ(14) తమ్ముడిని రక్షించే క్రమంలో మునిగిపోయాడు. కాలువ గట్టు సమీపంలోనే ఉన్న తండ్రి వెంకటేశ్వరరావు(50) ఇది చూసి అక్కడికి చేరుకున్నారు. కుమారులను రక్షించేందుకు కాలువలో దిగినా ఉద్ధృతికి అతనూ మునిగిపోయాడు.

కొడుకులు ఇంటికి రాలేదని.. కాలువ దగ్గరకు వెళ్లిన కుమారులు ఇంటికి రాకపోవటంతో తల్లి దేవి వారిని వెతుక్కుంటూ వెళ్లారు. కాలువలో వెంకటేశ్వరరావు చెయ్యి కన్పించడంతో స్థానికులు కాలువలోకి దిగి మృతదేహాన్ని వెలికి తీశారు. అదే ప్రాంతంలో గాలించగా పెద్దకుమారుడు మణికంఠ మృతదేహం దొరికింది. చిన్నకుమారుడు ఆచూకీ లభించలేదు. అగ్నిమాపకశాఖ సిబ్బంది అక్కడకు చేరుకొని గాలించారు. బురదలో కూరుకుపోయిన చిన్నకుమారుడు సాయికుమార్ మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. భర్త, కంటి పాపల్లాంటి కుమారులు మృతి చెందడంతో తల్లి గుండెలు బాదుకుంటూ కన్నీరు మున్నీరయ్యారు. వారి మృతదేహాలపై పడి విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. మరణాలను ఆత్మహత్యలు అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చరవాణిలో మాట్లాడుతూ కాలువలో పడి యువకుడి మృతి



రామకృష్ణ(పాతచిత్రం)

చాట్రాయి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై చరవాణిలో మాట్లాడుతూ వెళ్తున్న యువకుడు కాలువలో పడి మృతి చెందిన ఘటన చాట్రాయి మండలం బూరుగుగూడెంలో జరిగింది. గ్రామానికి చెందిన మునగాల రామకృష్ణ(25) బుధవారం ఉదయం పది గంటలకు చిన్నంపేట రహదారిలో ఉన్న పొలంలోకి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అదే దారిలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ ఒడ్డున వెళ్తుండగా.. గొయ్యిలో పడి వాహనం అదుపు తప్పింది. దీంతో రామకృష్ణ కాలువలో పడిపోయాడు. గమనించిన స్థానికులు రక్షించే యత్నం చేసినా.. ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చినా ఫలితం లేకపోయింది. ఎస్సై డి.రామకృష్ణ పర్యవేక్షణలో స్థానికులు సుమారు రెండు గంటలు శ్రమించగా మృతదేహం లభ్యమైంది. మృతుడు రామకృష్ణ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు. ఆరు నెలల కిందట వివాహం చేసుకున్నాడు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదన పలువురిని కంటతడి పెట్టించింది.

పాము కాటుతో చిన్నారి..



లాస్య

చాట్రాయి, న్యూస్‌టుడే: పాము కాటు వేసి చిన్నారి మృతి చెందిన ఘటన చాట్రాయి మండలం సి.గుడిపాడులో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన విస్సంపల్లి రవికుమార్, జయమ్మ దంపతులకు లాస్య(10), కుమారుడు ఏసన్న ఉన్నారు. ఉదయం ఆలస్యంగా నిద్ర లేచిన లాస్య బ్రష్ తీస్తుండగా పాము కాటేసింది. కాటు వేసిన సంగతి భయంతో ఇంట్లో చెప్పలేదు. పామును చూస్తూ కేకలు వేయగా.. తాత కృష్ణయ్య వచ్చి చంపాడు. లాస్య ఇంకా భయాందోళనతో ఉండగా పామును చూసి భయపడుతుందని అందరూ భావించారు. గంట తర్వాత పాప ప్రవర్తన చూసి అనుమానంతో తాత వేపాకు తీసుకొచ్చి తినమని, రుచి అడగ్గా చేదుగా లేదని చెప్పింది. వెంటనే నాటు మందు కోసం తీసుకెళ్లారు. పసరు పోసినా.. ఫలితం లేకపోవడంతో విస్సన్నపేటలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. లాస్య అయిదో తరగతి చదువుతోంది. చిన్నారి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

బాలికపై 5 నెలలుగా అత్యాచారం

● ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయని ఎస్సై ● బాధితులతో కలిసి ఐజీ దృష్టికి తెచ్చిన ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అభం శుభం తెలియని ఓ బాలికపై నిందితుడు అయిదు నెలలుగా అత్యాచారం చేసి గర్భిణిని చేశాడు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినా, ఎస్సై పట్టించుకోలేదు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి కుటుంబ సభ్యులతో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. దెందులూరు మండలానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి ద్వారకా తిరుమల మండలం మల్లసానికుంటకు చెందిన యువకుడు లోబర్చుకున్నాడని, ప్రస్తుతం బాలిక 5 నెలల గర్భిణి అని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి తల్లిదండ్రులు దెందులూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్నా, నేటికీ కేసు నమోదు చేయలేదని చింతమనేని అసంతృప్తి వ్యక్తం చేశారు.

దోపిడీ కేసులో నిందితుడికి 9 నెలల జైలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: వైద్యారోగ్య శాఖ నుంచి వచ్చానని.. ఆధార్ కార్డు చూపాలని ఓ గృహిణిని నమ్మించి... ఆపై డమ్మీ తుపాకీతో బెదిరించి పర్సు కాజేసిన నిందితుడికి 9 నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అధికారుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలేనికి చెందిన పసుపులేటి అజయ్‌కుమార్ అలియాస్ అజయ్ అలియాస్ అరుణ్‌శాస్త్రి ఏలూరు బావిశెట్టిపేటలో నివాసం ఉండేవారు. 2014, నవంబరు 24న స్థానికంగా నివాసముంటున్న పామర్తి వరలక్ష్మి ఇంటికెళ్లారు. తాను వైద్యారోగ్య శాఖ నుంచి వచ్చానని, ఆధార్ కార్డు చూపాలని కోరారు. ఆమె ఆధార్ తెచ్చేందుకు వెళ్లగా... అజయ్‌కుమార్ ఇంట్లోకి ప్రవేశించి డమ్మీ తుపాకీ, చాకుతో బెదిరించి పర్సు తీసుకొని పారిపోయాడు. బాధితురాలు ఒకటో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన వారు.. నిందితుడ్ని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. బుధవారం ఏలూరు రెండో ఏజేఎఫ్ సీఎం కం సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి బండి రచన తుది విచారణ చేపట్టారు. నేరం రుజువైనందున నిందితుడికి 9 నెలలు జైలు, రూ.1000 జరిమానా విధిస్తూ వెల్లడించారు.

వైకాపాకు పునర్వైభవం తెస్తాం: దూలం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో వైకాపాకు పునర్వైభవం తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా, నియోజకవర్గ కార్యాలయాలను బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... వైకాపా కార్యకర్తలకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చని ఎన్డీయే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. ప్రతి మండలంలో పర్యటించి కార్యకర్తల్లో నూతనోత్తేజం తెస్తానని ఆయన పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు మేకా ప్రతాప్ అప్పారావు, తెల్లం బాలరాజు, పుప్పాల వాసుబాబు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు జయప్రకాశ్, విజయరాజు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కేసుల ఎత్తివేతకు వినతి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం ఐకాస నాయకులపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ ఆ సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ ప్రతాప్ శివకిశోర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... 2022 ఆగస్టులో సీపీఎస్ ఉద్యమంలో పాల్గొన్న నాయకులపై గత ప్రభుత్వం కేసులు పెట్టిందని గుర్తుచేశారు. ఎస్పీ స్పందిస్తూ.. కలెక్టర్‌కు దస్త్రం పంపి ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొయ్యలగూడెంలో లిట్రసీ రీ క్రియేషన్ కేంద్రానికి 13 సెంట్ల భూమిని కేటాయించారని, దాన్ని కొందరు ఆక్రమించుకుని సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఐకాస నాయకులు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. ఏపీఎన్జీవో సంఘం అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెర్సు రామారావు, నాయకులు ఆంజనేయులు, కృష్ణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

పెదపాడు, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. కొత్తూరులో మంగళవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సీఐ సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు ఉన్నాయని, వాటిని ఆసరాగా తీసుకొని దుండగులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరాల బారిన పడితే 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. పెదపాడు ఇన్‌ఛార్జి ఎస్సై కె.ఎస్.సతీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

'మీ కోసం' ఫిర్యాదుపై క్షేత్ర పరిశీలన


గ్రామస్థులతో చర్చిస్తున్న ఆర్డీవో అచ్యుత అంబరీష్

పెదపాడు, న్యూస్‌టుడే: గ్రామ చెరువు ఆక్రమణపై వడ్డిగూడెం గ్రామస్థులు మూడ్రోజుల కిందట ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన 'మీ కోసం'లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. చెరువును ఓ వ్యక్తి ఆక్రమించుకొని అడ్డెకిచ్చినట్లు గ్రామస్థులు ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు నివేదిక రూపొందించి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు సునీత, వీఆర్వో ఘంటా ప్రభాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పైవంతెన నిర్మాణానికి సర్వే

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: 216ఏ జాతీయ రహదారిపై కైకరంలో పైవంతెన నిర్మాణానికి రెవెన్యూ, హైవే అథారిటీ అధికారులు బుధవారం భూ సర్వే చేపట్టారు. 2017-18లో పైవంతెన నిర్మాణానికి ఎంత మేర భూమి అవసరమో సర్వే చేసి హద్దులు వేశారు. నిర్వాసితుల భూ సేకరణ, పరిహారం విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైవే అథారిటీకి అనుకూలంగా తీర్పు రావడంతో పైవంతెన నిర్మాణానికి సన్నద్ధమవుతున్నారు. హద్దులు గుర్తించి ఆరేళ్లు దాటడంతో అవి చెరిగిపోవడం, భూ యజమానులు మారడంతో రెవెన్యూ దస్త్రాల ప్రకారం మళ్లీ సర్వే చేసి మార్కింగ్ వేస్తున్నారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు పూర్ణచంద్రప్రసాద్, మండల సర్వేయర్ విశ్వనాథ్, హైవే అథారిటీ ప్రత్యేక డిప్యూటీ తహసీల్దారు ఎన్‌వీవీ సత్యనారాయణ, వీఆర్వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.


భూములను సర్వే చేస్తున్న అధికారులు

పల్లె బిడ్డలు.. క్రీడల్లో దిట్టలు

ఉంగుటూరు, న్యూస్‌టుడే

ఉంగుటూరు మండలం కైకరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. ఇక్కడ పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలే ఎక్కువగా చదువుతున్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపుతున్నారు. పాఠశాలలోని పరిమిత వనరులను సద్వినియోగం చేసుకొని.. పీడీలు నాగసుధ, ఇ.పాపాయమ్మ పర్యవేక్షణలో రాటుదేలుతున్నారు. ఇటీవల పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్కడా రాణించేందుకు నిత్య సాధన చేస్తున్నారు.

కొత్తగా చేరినా..



కైకరానికి చెందిన ఆకుల సుభాష్ జడ్పీ పాఠశాలలో కొత్తగా ఎనిమిదో తరగతిలో చేరారు. ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తరచూ చెబుతుంటారు. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపుతున్నాడని తెలిసి... సుభాష్‌ను పిలిపించి ప్రత్యేకంగా అభినందించి, ప్రోత్సహిస్తున్నారు. తాజాగా జరిగిన అండర్-14 ట్రయాథ్లాన్-ఏ విభాగంలో లాంగ్‌జంప్, హైజంప్‌లో ప్రథమ స్థానం సాధించారు. 60 మీటర్ల పరుగులో తృతీయ స్థానం కైవసం చేసుకొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్కడా ప్రతిభ చూపాలని నిరంతరం సాధన చేస్తున్నారు. క్రీడా కోటాలో పోలీసు శాఖలో కొలువు సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు విద్యార్థి సుభాష్ తెలిపారు.

పరుగులో చిరుతలు



కైకరానికి చెందిన గోతిరెడ్డి యశ్వంత్, సందీప్ సోదరులు. అన్న పది, తమ్ముడు ఏడో తరగతి చదువుతున్నారు. తల్లి ఇంటి ఓ హోటల్‌లో పని చేస్తూ పిల్లలను చదివిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పరుగు పోటీల్లో అన్నదమ్ములిద్దరూ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. యశ్వంత్ అండర్-16 విభాగంలో 60 మీటర్ల పరుగు, సందీప్ అండర్-14 ట్రయాథ్లాన్-సీ విభాగంలో 60 మీటర్ల పరుగు పోటీలో ప్రథమ స్థానం, లాంగ్‌జంప్, 600 మీటర్ల పరుగు పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. వారిద్దరూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా, అక్కడా రాణించి తొలి స్థానాన్ని కైవసం చేసుకుంటామని సోదరులిద్దరూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847	ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483	ఉంగుటూరు: 79933 00492

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే

సమస్య: స్థానిక విజయ గార్డెన్స్ రైల్వే ట్రాక్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగిపోయాయి. ఈ కారణంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించాలి. **- కె.శ్రీనివాస్, స్థానికుడు**

సమాధానం: రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- భానుప్రతాప్, నగరపాలక అధికారి**

పెదవేగి, న్యూస్‌టుడే

సమస్య: ముండూరు బ్రాహ్మణ వీధి నుంచి శ్మశానానికి సరైన దారి సౌకర్యం లేదు. ఫలితంగా బ్రాహ్మణులు మృతదేహాలను శ్మశానానికి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చొరవ చూపాలి.
- విశ్వేశ్వరరావు, స్థానికుడు

సమాధానం: బ్రాహ్మణ వీధి నుంచి శ్మశానవాటికకు వెళ్లే దారిని పరిశీలించి, నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం **- షరీఫ్, ఈవోపీఆర్డీ**

ఉంగుటూరు, న్యూస్‌టుడే

సమస్య: ఉంగుటూరులోని సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం నుంచి డెల్టా గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే పైపులైన్ స్థానిక వంతెనపై లీకేజీ అవుతోంది. ఫలితంగా తాగునీరు వృథాగా కాలువలోకి పోతోంది. **- అక్బర్, స్థానికుడు**

పరిష్కారం: పైపులైన్‌ను పరిశీలించి మరమ్మతు చేయిస్తాం.
- రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

స్పందనకు సందడం

వెలిగిన వీధి దీపం.. **ఏలూరు తూర్పు వీధి, న్యూస్‌టుడే:** పోణంగి రోడ్డు మరడాని రంగారావు కాలనీలోని తాగునీటి ట్యాంకు వద్దనున్న వీధి దీపం ఎట్టకేలకు వెలిగింది. వారం రోజులుగా దీపం వెలగక పోవడంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఈ నెల 8న వార్త ప్రచురితమైంది. విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించి సిబ్బందితో దీపానికి మరమ్మతులు చేయించారు.

కాలువలో పూడిక తీత.. ఆర్‌ఆర్‌పేట శ్రీనివాస థియేటర్ రోడ్డులోని ప్రధాన కాలువలో ఎట్టకేలకు పూడిక తీశారు. కాలువలో మురుగు నిలిచిపోవడంపై ఈ నెల 7న ప్రచురితమైన వార్తకు నగరపాలక సహాయాధికారి జి.చంద్రయ్య స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలో పూడిక తీయించారు.

రెగ్యులేటర్ నిర్మాణానికి డిమాండ్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కొల్లేరుపై రెగ్యులేటర్ నిర్మించాలని ఏపీ రైతు సంఘం సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కలకుర్రు పెద ఎడ్లగాడి వద్ద సంఘ నాయకులతో కలిసి బుధవారం కొల్లేరును పరిశీలించి మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు కొల్లేరు పరిసర ప్రాంతాల్లోని చేపలు, రొయ్యల చెరువులు, వ్యవసాయ పంట పొలాలు ముంపునకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొల్లేరు పరిసర ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.


పెద ఎడ్లగాడి వద్ద కొల్లేరును పరిశీలిస్తున్న నాయకులు

అవినీతి నిర్మూలనతో దేశాభివృద్ధి

నిడమర్రు, న్యూస్‌టుడే: అవినీతి నిర్మూలనతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని గ్రామీణ బ్యాంకు విజిలెన్స్ ఇన్‌ఛార్జులు రాంబాబు, విజయకుమార్ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో అవినీతి వ్యతిరేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, ముగ్గురు విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. దేశ సమగ్రతకు కృషి చేస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. గోదావరి బ్యాంకు రీజినల్ మేనేజర్ శ్రీదేవి, మేనేజర్ శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు జ్ఞాపిక అందిస్తున్న రాంబాబు తదితరులు

నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తా: బడేటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రానున్న కాలంలో నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పవరుపేటలోని విడిది కార్యాలయంలో బుధవారం పాత్రికేయులతో మాట్లాడారు. స్నేహపూర్వక వాతావరణంలో మాత్రమే ఏలూరు వాస్తవికాభివృద్ధి సాధ్యమన్నారు. ఆ దిశగా సమర్థవంతమైన పాలనకు మరింత ప్రేరణ కలిగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక నగరపాలక సంస్థలో నూతనంగా పరిపాలనాపరమైన మార్పులు చేపట్టానన్నారు. అనుభవానికి పట్టం కట్టాలన్న ఉద్దేశంతో గత పాలకవర్గంలోని కో-ఆప్షన్ సభ్యుల స్థానంలో తెదేపాకు చెందిన ముగ్గురికి పదవులు కేటాయించామన్నారు. సమావేశంలో మేయర్ నూర్జహాన్, నాయకులు పి.శివప్రసాద్, వెంకటరత్నం, జె.సుమతి, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

ఆటో చోదకుల సంక్షేమానికి కృషి: పత్సమట్ల

భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలులో శ్రీవేంకటేశ్వర ఆటో యజమానులు, చోదకుల సంక్షేమ సంఘం నూతన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు బుధవారం ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఆటో చోదకుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అంతకుముందు నిర్వహించిన సభలో తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడారు. సంఘం గౌరవాధ్యక్షుడు బాదర్వాడ కృష్ణమోహనరాజు, నాయకులు కరణం పెద్దిరాజు, చీరా సాంబశివరావు, ప్రత్తి మదన్, నాయకులు పాల్గొన్నారు.


శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే ధర్మరాజు తదితరులు


ముగింపు కార్యక్రమంలో ఎంపీడీవో తదితరులు

పల్లె పాలన చేరువ చేద్దాం

గణపవరం, నిడమర్రు, న్యూస్‌టుడే: గ్రామీణులకు పల్లె పాలన చేరువ చేయాల్సిన బాధ్యత వార్డు సభ్యులపై ఉందని ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి అన్నారు. గణపవరం మండల పరిషత్తు కార్యాలయంలో రెండ్రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. శిక్షణ పూర్తి చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

★ నిడమర్రు మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామ పంచాయతీల పాలనపై బుధవారం వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో విజయకుమారి అధ్యక్షత వహించి, పలు సూచనలు చేశారు.

ద్వారకాతిరుమలకు బస్సులు పెంచాలి

దెందులూరు, న్యూస్‌టుడే: ఏలూరు నుంచి దెందులూరు మీదుగా ద్వారకాతిరుమలకు ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని రామారావుగూడేనికి చెందిన మద్దా భూషణం విజ్ఞప్తి చేశారు. అమరావతిలో ఇటీవల నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రి స్పందిస్తూ.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తదనుగుణంగానే బుధవారం భూషణాన్ని ఆర్టీసీ అధికారులు కలిశారు. దెందులూరు మీదుగా ద్వారకా తిరుమలకు బస్సు సర్వీసులు పెంచేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని వారు తెలిపారు.



సరస్వతీదేవి మందిరం ప్రారంభం

భీమడోలు, న్యూస్‌టుడే: పూళ్ల జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 1988-89 పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు రూ.3 లక్షల వ్యయంతో నూతనంగా సరస్వతీదేవి మందిరం నిర్మించారు. ఈ సందర్భంగా అమ్మవారి పాలరాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు పెనుగొండ భువనేశ్వరరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామస్థులకు సారె పంపిణీ

నిడమర్రు, న్యూస్‌టుడే: మందలపర్రు ఉమా నీలకంఠేశ్వరస్వామి క్షేత్రంలో ఈ నెల 8న అమ్మవారికి గ్రామస్థులు టన్నున్నరతో 11 రకాల మిఠాయిలు తయారు చేయించిన విషయం విదితమే. వాటిని బుధవారం 1800 పొట్లాలు కట్టి.. అందులో గాజులు, పసుపు, కుంకుమ ఉంచి ఇంటింటికీ పంచిపెట్టారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకట సుబ్బరాజు, శంకరం, కె.రామచంద్రరాజు. పి.కృష్ణంరాజు పర్యవేక్షించారు.

కైకరంలో భారీ అన్నసమారాధన

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: కైకరంలోని మంచినీటి చెరువు వద్ద వినాయక చవితి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా పెద్దఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేశారు. జనసేన నాయకులు వట్టి పవన్‌కుమార్, వంగా రఘు పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. ఏర్పాట్లను శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం, రంగా యువసేన గౌరవాధ్యక్షుడు వెజ్జు సుబ్బారావు, ఆలయ కమిటీ, రంగా యువసేన సభ్యులు పర్యవేక్షించారు.

జ్ఞానరూపాయ.. విజ్ఞానమూర్తాయ!


ఏలూరు: సరస్వతీదేవిగా కనకదుర్గమ్మ


అంబికాదేవి


లక్ష్మీ గణపతి ఆలయంలో..


12పంపుల కూడలిలో..

ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. మూల నక్షత్రం సందర్భంగా ఏడో రోజైన బుధవారం అమ్మవార్లు సరస్వతీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. పలు ఆలయాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణ చేశారు. ఏలూరు నగరంలోని అన్ని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బావిశెట్టివారిపేటలో అమ్మవారిని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. ఉంగుటూరు, నిడమర్రు, భీమడోలు, పెదపాడు, పెదవేగి మండలాల్లోని ఆలయాల్లోనూ శక్తిస్వరూపిణిలను విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు విచ్చేసి వీణాధారియైన చదువుల తల్లిని దర్శించుకొని పరవశించారు. వారికి అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

- న్యూస్‌టుడే బృందం


ఏలూరు: దత్తాశ్రమంలో..


ఏలూరు: సౌభాగ్యలక్ష్మి


పెదపాడు: రాట్నాలమ్మ


భీమడోలు: భ్రమరాంబ


ఉంగుటూరు: చల్లాలమ్మ


గీతా భవన్‌లో..


ఏలూరు: చిన్నారులకు అక్షరాభ్యాసం


ఉంగుటూరు: కైకరం సాయిబాబా ఆలయంలో..


నిడమర్రు: నవదుర్గలుగా సువాసినులు


మాట్లాతున్న డివిజన్ సూపరింటెండెంట్ శ్రీకర్‌బాబు

విస్తృతంగా తపాలా సేవలు

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: తపాలా శాఖలోని పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ డివిజన్ సూపరింటెండెంట్(ఎస్పీ) ఎస్.శ్రీకర్‌బాబు తెలిపారు. స్థానిక ఒకటో పట్టణం పెరుగు చెట్టు వద్దనున్న ప్రధాన తపాలా కార్యాలయంలో బుధవారం తపాలా దినోత్సవం నిర్వహించారు. ఆ శాఖ మేనేజర్ రంగారావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పార్శిళ్లు పంపే విధానాన్ని మరింత సులభతరం చేశామన్నారు. తపాలా సేవలకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తుండటం ఆనందదాయకమన్నారు. ప్రధాన తపాలా కార్యాలయాల్లో లభ్యమయ్యే పాస్‌పోర్టు సేవలు, ఇండియా పోస్టు పేమెంట్స్(బ్యాంకు సేవలు)పై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఏఎస్పీ డి.శ్రీనివాసరావు, సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, దుర్గారావు, ఐపీపీబీ మేనేజర్ రాజేశ్, పోస్టుమ్యాన్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

బాధితురాలికి నిత్యావసరాల వితరణ

దెందులూరు, న్యూస్‌టుడే: గాలాయగూడెం పంచాయతీ నాగులుదేవునిపాడులో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌కు గురై ఇల్లు కాలిపోయింది. నిరాశ్రయురాలైన నందేటి ఏసమ్మకు తెదేపా గ్రామాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, వి.రాజా బుధవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పోణంగికి చెందిన కుమారస్వామి తాపీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన ఆయన... కుటుంబాన్ని విస్మరిస్తున్నాడు. దీనిపై భార్య గట్టిగా నిలదీయడంతో బుధవారం పురుగుమందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

పెదపాడు, పెదవేగి, న్యూస్‌టుడే: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి... లాభాలు ఆర్జించాలని వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార్ సూచించారు. రాజుపేటలో బుధవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించి... రైతులకు పలు సూచనలు చేశారు. డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీతో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు వరి పొలాలు పరిశీలించారు. ★ పెదవేగి మండలం గార్లమడుగు, కవ్వకుంట గ్రామాల్లో వ్యవసాయాధికారిణి ముత్యాల ప్రియాంక ఆధ్వర్యాన 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. రైతులకు సాగులో మెలకువలపై అవగాహన కల్పించారు.

కైకరం(ఉంగుటూరు): కైకరంలో వ్యవసాయాధికారి ఎన్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన బుధవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. రైతులకు పలు సలహాలు, సూచనలిచ్చారు. సర్పంచి సలగాల గోపి, పశు వైద్యాధికారి అశోక్ కుమార్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.


పెదపాడు: రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి ప్రదీప్‌కుమార్

ఏలూరు సినిమా

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబిక డీలక్స్	కమిటీ కుర్రోళ్లు
అంబిక మినీ	రామనగర్ బన్నీ
సాయిబాలాజీ	కాళీ
బాలాజీ	శ్వాగ్
సత్యనారాయణ స్క్రీన్ 1	సత్యం సుందరం
సత్యనారాయణ స్క్రీన్ 2	వేట్టయన్
సత్యనారాయణ స్క్రీన్ 3	వేట్టయన్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	దేవర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	సెలబ్రిటీ
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	--------
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	ఏఆర్ఎం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	మత్తు వదలరా 2

రహదారులకు మహర్దశ

దెందులూరు, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వ హయాంలో కొత్త రోడ్లు నిర్మించలేదు కదా... కనీసం తట్టెడు మట్టి పోసిన దాఖలాల్లేవు. ఈ అధ్వాన దారులు వాహనదారుల పాలిట శాపంగా మారాయి. ప్రమాద తీవ్రతను గుర్తించిన ఎన్డీయే ప్రభుత్వం... దిద్దుబాటు చర్యలకు దిగింది. రహదారుల తక్షణ మరమ్మతులకు నిధులు కేటాయించింది. వాటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉండటంతో.. ఆయా రహదారులకు మహర్దశ కలగనుంది.

అత్యవసర పనులకు కేటాయించిన నిధులిలా..

రహదారి	ఎక్కణ్నుంచి ఎక్కడి వరకు(కి.మీ.ల్లో)	మంజూరైన నిధులు(రూ.లక్షల్లో)
నూజివీడు - ఏలూరు	22.600-24.400	100
నూజివీడు - ఏలూరు	24.400-28.600	28
నూజివీడు - ఏలూరు	28.600-29.800	100
ఏలూరు - జంగారెడ్డిగూడెం	6.00-21.000	100
ఏలూరు - మేడిశెట్టివారిపాలెం	9.600-10.600	60
దెందులూరు - పంగిడిగూడెం	0.000-19.980	100

రూ.5 కోట్లు విడుదల


రోడ్డుకు వేసిన ప్లాస్టింగ్

దెందులూరు నియోజకవర్గంలోని ఏలూరు గ్రామీణ, దెందులూరు, పెదవేగి, పెదపాడు మండలాలున్నాయి. ఇందులో దెందులూరు, పెదవేగి మండలాల్లోని ప్రధాన రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం రూ.5 కోట్లు అత్యవసర నిధులు మంజూరు చేసింది. దెందులూరు నుంచి పంగిడిగూడెం, ఏలూరు నుంచి నూజివీడు, ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే ప్రధాన రహదారులతో పాటు వివిధ అధ్వాన రోడ్లకు మరమ్మతులు చేయనున్నారు. ఉంగుటూరు మండలంలోని పలు రహదారుల బాగుకు రూ.70 లక్షలు కేటాయించింది. 'రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల తక్షణ మరమ్మతులకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు అత్యవసర నిధులు కేటాయించింది. ఈ నెల 14 నుంచి రహదారి మరమ్మతులు చేయనున్నాం' అని ర.భ.శాఖ డీఈఈ శ్రీకర్ తెలిపారు.

మూత మరిచి.. ప్రమాదాలు పిలిచి!



ఏలూరు పత్తేబాదలోని గంగానమ్మ ఆలయం వద్ద మురుగు కాలువ పూడిపోయింది. దాన్ని తొలగించేందుకు మ్యాన్‌హోల్‌పై మూత తీసి పక్కన పెట్టారు. సుమారు నెల రోజులవుతున్నా... పూడిక తీత పనులు పూర్తి చేయలేదు. ఫలితంగా రోడ్డు మధ్యనున్న మ్యాన్‌హోల్, దాని పక్కనే మూత ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూడికతీత పనులు త్వరితం పూర్తి చేయిస్తామని నగరపాలక అధికారి భానుప్రతాప్ తెలిపారు.
- న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్

పోలవరం
• పోలవరం • చింతలపూడి

నాయీబ్రాహ్మణులకు కేటాయించిన స్థలం పరిశీలన


పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలో నాయీబ్రాహ్మణులకు కేటాయించిన స్థలాన్ని జేసీ ధాత్రిరెడ్డి బుధవారం పరిశీలించారు. ద్వారకాతిరుమలలో ప్రభుత్వ భూమి ఎంత ఉంది, స్థలం కేటాయింపులో ఏమైనా ఇబ్బందులున్నాయా.. ఏ ప్రాతిపదికన కేటాయించారన్న అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జేవీ సుబ్బారావు, నాయీబ్రాహ్మణుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన శబరిమలకు



చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడికి చెందిన లోపూడి శ్రీను స్వామి ఆధ్వర్యంలో 15 మంది భక్తులు కేరళ రాష్ట్రం శబరిమలలోని అయ్యప్పస్వామి దేవస్థానానికి బుధవారం పాదయాత్రగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సుమారు 10 కుక్కలు సంచరిస్తున్నాయి. ఉదయం నడిచే వారిపై దాడి చేస్తున్నాయి. **- శ్రీనివాస్, స్థానికుడు**

సమాధానం: కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటాం. **-కేవీ రమణ, కమిషనర్**

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: చింతలపూడి నుంచి భట్టువారిగూడెం వెళ్లే రహదారి గోతులతో అధ్వానంగా మారింది. వర్షం పడితే ద్విచక్ర వాహనాలు తిరగడం కష్టంగా ఉంటుంది. **-రాజీవ్, స్థానికుడు**

సమాధానం: మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **-పావని కమిషనర్**

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని ములగలంపల్లిలో గౌడ రామాలయం వద్ద మురుగు రహదారిపై పారుతోంది. అటుగా విద్యార్థులు పాఠశాలలకు వెళుతుంటారు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. **-పి.ఆంజనేయులు, స్థానికుడు**

సమాధానం: కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం. **-ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి**

పక్క పక్కనే నిర్మించి..
పనికి రాకుండా చేసి!

నిరుపయోగంగా రూ.80 లక్షల నిర్మాణాలు


పి.రాజవరం గోదాము

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే

అన్నదాతలకు ఆసరాగా నిలవాల్సిన నిర్మాణాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. రూ.లక్షలు వెచ్చించినవి అక్కరకు రాకుండా పోయాయి. వైకాపా నాయకుల ఆధిపత్య పోరు ప్రస్తుతం రైతుల పాలిట శాపంగా తయారైంది.


ఖాళీగా ఉన్న జీలుగుమిల్లి గోదాము

కేవలం 1300 మీటర్ల వ్యవధిలోనే..

గత వైకాపా ప్రభుత్వంలో ములగలంపల్లి, స్వర్ణవారిగూడెం, పి.రాజవరం, జీలుగుమిల్లికి గోదాములు మంజూరు కాగా.. రెండు మాత్రమే పూర్తి చేశారు. అవి కూడా కేవలం 1300 మీటర్ల దూరంలో పి.రాజవరం గ్రామ సమీపంలో నిర్మించారు. దీంతో 32 గ్రామాలకు ఆసరాగా ఉండాల్సిన గోదాములను రెండు గ్రామాల మధ్య అత్యంత దగ్గరగా నిర్మించడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారి మందుబాబులకు అడ్డాగా మారాయి.


మందుబాబులు వదిలేసిన సీసాలు

నాయకుల ఆధిపత్య పోరుతో..

వాస్తవానికి జీలుగుమిల్లి సొసైటీ పరిధిలో 13 గ్రామాలున్నాయి. ఇక్కడ రెండు నిర్మించాల్సి ఉండగా పి.రాజవరం గ్రామానికి రెండు వైపులా ఒక్కో గోదామును రూ.40 లక్షలతో నిర్మించారు. నాయకులు ఆధిపత్యాలకు పోయి నిర్మాణాల దూరాలను తగ్గించారు. ఇందులో ఒక గోదాము కామయ్యపాలెం లేదా రాచన్నగూడెంలో నిర్మిస్తే రైతులకు ఎంతగానో ఉపయోగపడేది.

కార్యదర్శుల లబోదిబో..

పి.రాజవరం దాటాక ఉన్న గోదాము తలుపులకు తాళాలు వేయకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. మరో గోదాము ఓ ప్రజాప్రతినిధికి చెందిన వ్యక్తికి నాలుగు నెలల కిందట నామమాత్రపు అద్దెకిచ్చి చేతులు దులుపేసుకున్నారు. ఇది కూడా గత నెల 30 నాటికి గడువు ముగిసింది. ఇంతవరకు మరో రైతు ముందుకు రాలేదు. గోదాముల నిర్మాణ రుణాలను సంబంధిత సొసైటీలే చెల్లించాల్సి ఉండటంతో కార్యదర్శులు లబోదిబోమంటున్నారు.

అన్నదాతలు ముందుకు రావడం లేదు

పనుల్లో నాణ్యతను గాలికొదిలేయడంతో ఇటీవల వర్షాలకు గోడల్లో చెమ్మ దిగుతోంది. దీంతో అన్నదాతలు పంటలు దాచుకునేందుకు ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితిపై జీలుగుమిల్లి సొసైటీ కార్యదర్శి కృష్ణమోహన్ మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పించి గోదాములు అద్దెకు తీసుకునేలా కృషి చేస్తామని చెప్పారు.

ఉచిత ఫ్రీజరు సేవలు ప్రారంభం

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కన్నాపురంలో ఉచిత ఫ్రీజరు సేవలను ప్రారంభించినట్లు ఈడుపుగంటి మనోహర్‌చౌదరి బుధవారం తెలిపారు. విజయవాడకు చెందిన పవన్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ మైనేని సాయిబాబు ద్వారా కన్నాపురం పరిసర ప్రాంతాల వారికి ఫ్రీజరును అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు చర్యలు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని బర్రింకలపాడులో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన 11కేవీ విద్యుత్తు లైనును బుధవారం ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్తు డీఈ రాధాకృష్ణ, ఏడీఈ రాజ్‌కుమార్, జేఈఈ గోలునాయక్, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బర్రింకలపాడులో విద్యుత్తు లైను ప్రారంభిస్తున్న బాలరాజు

సమస్యల పరిష్కారం కోరుతూ ॥ వినతులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేఆర్‌పురం ఐటీడీఏలో బుధవారం పలువురు గిరిజనులు ఏపీవో పీవీఎస్ నాయుడును కలిసి వినతులు అందజేశారు. మొత్తం 11 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. వీటిలో పునరావాస సమస్యలపై ఎక్కువ వచ్చాయి.

బాణసంచా సామగ్రి స్వాధీనం

లింగపాలెం, న్యూస్‌టుడే: లింగపాలెం మండలం పుప్పాలవారిగూడెంలోని ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.16,850 విలువైన బాణసంచా సామగ్రిని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ధర్మాజీగూడెం ఎస్సై కె.వెంకన్న తెలిపారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పోలవరం, న్యూస్‌టుడే: కొత్త పట్టిసీమ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. పట్టిసీమకు చెందిన కొడి పోసి అనే వ్యక్తి వ్యవసాయ పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా.. పోలవరం వైపు నుంచి ఎదురుగా వచ్చిన నాలుగు చక్రాల ఆటో సంఘటనా స్థలం వద్ద ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. అతడిని స్థానికులు 108 వాహనంలో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు.

కుక్కల దాడిలో ముగ్గురికి.. టి.నరసాపురం, న్యూస్‌టుడే: రాజుపోతేపల్లిలో బుధవారం ఊర కుక్కలు దాడి చేయడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఆ గ్రామానికి చెందిన గుంజాల నాగరాజు, లక్ష్మి, కానూరి కన్యను కుక్కలు విచక్షణారహితంగా కరిచాయి. వెంటనే అక్కడకు చేరుకున్న స్థానికులు వాటిని తరిమేశారు. గాయపడిన వారిని 108 వాహనం ద్వారా చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో ఉండాలి: ఎమ్మెల్యే


రాఘవాపురంలో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రోషన్‌కుమార్

చింతలపూడి, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వాల నమోదును నాయకులు, కార్యకర్తలు ముందుండి నడిపించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని రాఘవాపురంలో ఆ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం అయిదు నియోజకవర్గాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఈ విషయంలో నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉండేలా నాయకులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ముత్తారెడ్డి, మండల అధ్యక్షుడు మాటూరి వెంకట్రామయ్య, చిట్లూరి ధర్మరాజు పాల్గొన్నారు. ✦ పట్టణంలోని మెరకవీధిలో బుధవారం ఏర్పాటు చేసిన అమ్మవారి అన్న సమారాధనలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పాల్గొన్నారు.

లింగపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మాజీగూడెంలో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ప్రారంభించారు. నాయకులు చలపతిరావు, జి.బుజ్జియ్య, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం తెదేపా కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ ప్రారంభించారు. తొలి సభ్యత్వాన్ని మహంకాళీ రామ్మోహనరావుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, నంగలూరి జగత్‌కుమార్, కంచర్ల గణేశ్, షేక్ యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో పెట్టుబడి ఆదా

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పంటల సాగులో యాంత్రీకరణ ద్వారా పెట్టుబడి ఆదా అవుతుందని వ్యవసాయ శాఖ కన్నాపురం హబ్ మేనేజర్ సోమశేఖర్ రైతులకు సూచించారు. కన్నాపురం, సరిపల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. క్షేత్ర పరిశీలనలో భాగంగా కన్నాపురంలో డ్రోన్ సాయంతో ఎరువులు, పురుగుమందుల పిచికారీ, ప్రయోజనాలను రైతులకు వివరించారు. సరిపల్లిలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయశాఖ కేఆర్‌పురం సబ్ డివిజన్ ఏడీ బుజ్జిబాబు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. సరిపల్లి సర్పంచి గోపి, మండల వ్యవసాయాధికారి చెన్నకేశవులు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అగ్గి తెగులు నివారణకు సూచనలు..

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: వరి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు సూచించారు. జైనవారిగూడెం, విప్పలపాడు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వరి చేలను పరిశీలించి.. అగ్గి తెగులు ఉన్నట్లు గుర్తించారు. నివారణకు ఎకరాకు 120 గ్రాముల ట్రైసైక్లోజోల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం రైతులకు అందించే పథకాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామని ఏవో బి.సుమలత అన్నారు. తెడ్లెం, రాజుపోతేపల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె పలు రకాల పంటలను పరిశీలించి, సస్యరక్షణ చర్యలను వివరించారు. తెడ్లెంలో పలువురు రైతులు తమకు పీఎం కిసాన్ నగదు రావడం లేదని తెలిపారు.


డ్రోన్‌తో ఎరువుల పిచికారీ విధానాన్ని వివరిస్తున్న అధికారులు

ఉపాధి పనులపై సమీక్ష

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులు, కార్యక్రమాల అమలుపై ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రసహాయకులు, సాంకేతిక సహాయకులు ఇతర సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉపాధి పథకం ఏపీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అప్రకటిత కోతలతో అవస్థలు


వైఎస్సార్ కాలనీలో మరమ్మతులు

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి పట్టణం, మండలంలో అప్రకటిత విద్యుత్తు కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు. వాతావరణ మార్పులతో ఎప్పుడు ఎండ వస్తుందో ఎప్పుడు వర్షం కురుస్తోందో తెలియడంలేదు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండటంతో పట్టణంలో ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వైఎస్ఆర్ కాలనీలో ఎలాంటి ప్రకటన లేకుండా సరఫరా నిలిపేశారు. మరమ్మతుల పేరుతో గంటల తరబడి నిలిచిపోతుండటంతో నానా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఉదయం ఎనిమిది గంటలకు ఆగిన సరఫరా ఒక్కోసారి రాత్రి అయినా పునరుద్ధరించడంలేదని పట్టణ వాసులు వాపోతున్నారు. దీంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. రాత్రి వేళలో దోమల బెడదతో నిద్ర లేని రాత్రులు గడుపుతున్నామంటున్నారు. విద్యుత్తు కోతలతో తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని దుకాణదారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అప్రకటిత విద్యుత్తు కోతలను నియంత్రించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం

'వైఎస్ఆర్ కాలనీలో అల్ప విద్యుత్తు సమస్య తీవ్రంగా ఉండటంతో మరమ్మతులు చేస్తున్నాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తాం'అని చింతలపూడి ఏడీఈ రాంబాబు నాయక్ తెలిపారు.

నీటి ఎద్దడితో రైతుల గగ్గోలు!


నాగులగూడెం సమీపంలో పడిన గండి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఎర్ర కాలువ ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువకు నాగులగూడెం సమీపంలో 4.5 కిలోమీటరు వద్ద ఈ నెల 5న గండి పడింది. ఈ కారణంగా దిగువన ఉన్న పంట చేలు మునుగుతుండటంతో అదే రోజు సాయంత్రం కాలువ కట్టేశారు. గండి పడిన ప్రాంతంలో పంట కాలువకు నీరు వెళ్లే ఓటీ (ఆఫ్‌టేక్) ఛానల్ కాంక్రీట్ గోడలు పడిపోవడంతో గట్టు బలహీనమై తెగింది. కాలువ కింద సుమారు ఆరు వేల ఎకరాలు సాగవుతున్నాయి. అయిదు రోజులుగా సరఫరా లేకపోవడంతో పంటలకు నీటి ఎద్దడి తలెత్తింది. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మట్టితో గండి పూడ్చితే సమస్య పరిష్కారం కాదని డీఈ రాంబాబు తెలిపారు. పైపులు అమర్చాల్సి ఉందన్నారు. నిధుల కోసం ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే గండి పూడ్చి నీరు అందేలా చర్యలు తీసుకుంటామని డీఈ పేర్కొన్నారు.

భాజపాలో చేరికలు

పోలవరం, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి పలువురు పార్టీలో చేరడం శుభపరిణామమని భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిశోర్ అన్నారు. మండలంలోని మహాలక్ష్మీదేవిపేటలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు భాజపాలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు మాలతీరాణి, కాంచనమాల, కె.నాగరాజు, అనితకుమారి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యాభివృద్ధికి తోడ్పాటు


శ్రీనివాసులును అభినందిస్తున్న ఎంఈవోలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతాల్లో గిరిజన విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చి తోడ్పాటు అందిస్తుందని ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ని పలువురు మండల విద్యాశాఖాధికారులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం ఎంఈవోలు తెల్లం బాబూరావు, జలగం సురేశ్, శ్రీనివాస్, బుద్దుల రాముడు, బుచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక రహిత సమాజ స్థాపనకు కృషి



ప్రదర్శనలో పాల్గొన్న న్యాయమూర్తులు తేజస్వి, కిశోర్‌కుమార్

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: బాల కార్మికులు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వహించాలని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిశోర్‌కుమార్, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేవీఎస్ఆర్ తేజస్వి అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. కోర్టు సముదాయాల నుంచి ప్రారంభమై.. ఏలూరు రోడ్డులో సాగింది. ఇందులో పాల్గొన్న న్యాయమూర్తులు మాట్లాడుతూ దుకాణాలు, హోటళ్లు, కర్మాగారాల్లో పనిచేసే బాలలను పాఠశాలలకు పంపేలా అధికారులు కృషి చేయాలన్నారు.

కూడలిలో ట్రాఫిక్ కష్టాలు!



లింగపాలెం, న్యూస్‌టుడే: లింగపాలెం ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి జిల్లా కేంద్రం ఏలూరు వెళ్లడానికి ప్రయాణికులు ఇక్కడి నుంచే బస్సులు ఎక్కుతుంటారు. చిరు వ్యాపారులు తమ దుకాణాలను రహదారిపై ఏర్పాటు చేస్తుండటంతో బస్సుల కోసం వేచి ఉండేందుకు స్థలం ఉండటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందంటున్నారు. ఈ విషయమై ధర్మాజీగూడెం ఎస్సై కె.వెంకన్న మాట్లాడుతూ పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు.


సరస్వతీదేవి అలంకరణలో జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ


కామవరపుకోట చెక్‌పోస్టు వద్ద


ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ


కన్నాపురంలో..


బయ్యనగూడెంలో..

జ్ఞాన జ్యోతి.. నమస్తుభ్యం!


గంగానమ్మ ఆలయంలో చిన్నారుల సరస్వతి పూజ


లలితా త్రిపురసుందరిగా జంగారెడ్డిగూడెం నూకాలమ్మ


పట్టిసీమలో కుంకుమపూజ


జీలుగుమిల్లిలో..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లు ఏడో రోజు బుధవారం సరస్వతీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు, బతుకమ్మలతో నృత్యాలు చేశారు. ప్రత్యేక అలంకరణలోని అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పలు చోట్ల వివిధ రకాల వంటకాలతో సారె సమర్పించారు. అన్నదానాలు నిర్వహించారు. **- న్యూస్‌టుడే, బృందం**

శ్రీవారి సేవలో సినీ దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల



ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల శ్రీవారిని సినీ దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మిద్దె తోట కాదు.. నిర్లక్ష్యానికి పరాకాష్ఠ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భవనమిది. కొన్నేళ్ల కిందట డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పాల శీతలీకరణ కేంద్రం భవనం నెలల వ్యవధిలోనే మూతపడి ఏళ్ల తరబడి నిరుపయోగంగా పడి ఉంది. అందులోని జనరేటర్, సిలిండర్లు తదితర ఖరీదైన యంత్రాలు తుప్పు పట్టి పాడయ్యాయి. భవనంపై శ్లాబ్‌పైన గడ్డి, తుప్పలు పెరిగి మిద్దె తోటను తలపిస్తున్నాయి. ఇదే పరిసరాల్లో దాదాపు పదికి పైగా ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. పలువురు మండల, డివిజన్ స్థాయి అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అయినా ఎవరూ పట్టించుకున్న పాపాన లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏపీయం బి.శ్రీనివాస్ మాట్లాడుతూ భవనంపైన పెరిగిన తుప్పలను సత్వరం తొలగించి శుభ్రం చేయిస్తామన్నారు.



నూజివీడు
● నూజివీడు ● కైకలూరు

వాహన తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై రామకృష్ణ

చాట్రాయి, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలను నడిపే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని, పదేపదే పునరావృతమైతే వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్సై డి.రామకృష్ణ అన్నారు. కృష్ణారావుపాలెంలో రాష్ట్రీయ రహదారిలో మంగళవారం అర్ధరాత్రి ఆయన వాహన తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు



ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం- చేవూరు పాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని బుధవారం కొల్లేటికోట పెద్దింట్లమ్మ ఆలయ ఈవో కె.శ్రీనివాసరావు సమక్షంలో ఆలయ ఏసీ ఆర్.గంగాశ్రీదేవి పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. 101 రోజులకు గాను హుండీ ద్వారా రూ.9,56,325లు, అన్నదానం హుండీ ద్వారా రూ.1,10,646లు మొత్తం రూ.10,66,971లు, వెండి 450 గ్రాములు సమకూరింది. దుర్గా శివసాయి సేవా కమిటీ సభ్యులు, గ్రామస్థులు లెక్కింపులో పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు :	99486 40551	కైకలూరు:	73060 88555
ముసునూరు :	93983 81268	కలిదిండి:	90594 84862

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: నూజివీడు పట్టణం బాపునగర్‌లో గేదెల వారి పాక వద్ద వీధి దీపం వెలగడం లేదు. **- వెంకటేశ్వరరావు, నూజివీడు**

సమాధానం: వెంటనే వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మీనారాయణ, మున్సిపల్ డీఈ**

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని రాచపట్నం పంచాయతీ పరిధిలోని చింతలచెరువులో కొన్ని రోజులుగా పంచాయతీ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. దీంతో చీకట్లో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నాం. **- రాధాకృష్ణ, గ్రామస్థుడు**

సమాధానం: వెలగని వీధి దీపం స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. **- శివన్నారాయణ, పంచాయతీ కార్యదర్శి**

కలిదిండి, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని కోరుకొల్లు మంచినీటి రక్షిత పథకం నుంచి సరఫరా అవుతున్న నీరు తాగేందుకు పనికి రావడం లేదు. క్లోరినేషన్ చేయకుండానే నీరు విడుదల చేయడంతో దుర్వాసన వస్తోంది. **- కృష్ణతేజ, కోరుకొల్లు**

సమాధానం: పూర్తిగా క్లోరినేషన్ చేసేలా చర్యలు తీసుకుని సురక్షిత తాగునీరు అందేలా చూస్తాం. **- రాఘవేంద్రరావు, పంచాయతీ ఈవో**

తాగునీరు సురక్షితమేనా!

● నీటి ట్యాంకుల్లో కానరాని క్లోరినేషన్ ● పట్టించుకోని సిబ్బంది

క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి

నూజివీడు మండలంలో 29 పంచాయతీల్లో 76 రక్షిత మంచినీటి పథకాలున్నాయి. వాటిలో ఓగిరాల తండ, ముక్కొల్లుపాడు, సిద్ధార్థ నగర్ ప్రాంతాల్లో, ఆగిరిపల్లి మండలంలోని 25 పంచాయతీల్లో 61 రక్షిత మంచినీటి పథకాలున్నాయి. వీటిలో అమ్మవారి గూడెం, వట్టిగుడిపాడు, పిన్నమరెడ్డిపల్లి గ్రామాల్లో, ముసునూరు మండలంలో 16 పంచాయతీల్లో 46 రక్షిత గోపవరం, కాట్రేనిపాడు, కొర్లగుంట, చింతలవల్లి, లోపూడి, ముసునూరు, చాట్రాయి మండలంలో 18 పంచాయతీల్లో 35 రక్షిత మంచినీటి పథకాలున్నాయి. వాటిలో.. తుమ్మగూడెం, చీపురుగూడెం, పోలవరం, జనార్దనవరం, సోమవరం గ్రామాల్లో ట్యాంకులు పైకి వెళ్లి శుభ్ర పరిచేందుకు మెట్లు లేవు. మరికొన్ని ప్రాంతాల్లో శిథిలమయ్యాయి.


పిన్నమరెడ్డిపల్లిలో శిథిలావస్థకు చేరిన తాగునీటి ట్యాంకు

నూజివీడు, న్యూస్‌టుడే

నియోజకవర్గంలో ఇలా..		
మండలం	పంచాయతీలు	జనాభా
నూజివీడు	29	1,29,963
ఆగిరిపల్లి	25	62,098
ముసునూరు	16	57,197
చాట్రాయి	18	53,493

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించే విషయంలో శ్రద్ధ కొరవడుతోంది. సాధారణంగా మంచినీటి పథకాల నీటి నిల్వ ట్యాంకులను ప్రతి 15 రోజులకొకసారి శుభ్ర పరచాలి. నీటి శుభ్రతను పరీక్షించాలి. అవసరాన్ని బట్టి ట్యాంకులకు నీరు సరఫరా అయ్యే గొట్టాలను శుభ్రం చేయించాలి. క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయించాలి. నీటి పరీక్షలు చేసి ఫలితాలు పంచాయతీ కార్యాలయాల వద్ద బహిరంగ పరచాలి. కానీ ఇవేమీ సక్రమంగా జరగడం లేదు. మరో వైపు ట్యాంకులను పట్టించుకునే నాథుడే కరవవడంతో చాలా చోట్ల మరమ్మతులకు గురవుతున్నాయి. నూజివీడు నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

15 రోజులకు ఒకసారి శుభ్ర పరచాలి..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రక్షిత పథకాలను సంబంధిత ఓవర్ హెడ్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్ర పరచాలి. అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ట్యాంకును శుభ్రం చేసిన తేదీలను నల్ల బోర్డుపై రాయాల్సి ఉంది. తాగునీటిలో బ్లీచింగ్ కలిపి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉంది.

సిబ్బంది కొరత..

సిబ్బంది పరంగా చూస్తే.. ప్రస్తుతం నాలుగు మండలాలకు ఒక్క ముసునూరు మండలానికి మాత్రమే ఏఈ ఉన్నారు. నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాలకు ఏఈలు లేరు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతోనే పనులు చేయిస్తున్నారు.

శుభ్రం చేయించాల్సిందే..

గ్రామ పంచాయతీలు నీటి ట్యాంకులను శుభ్రం చేయాల్సిందే. సచివాలయాల్లో పనిచేస్తున్న కార్యదర్శులకు, ట్యాంకులు ఆపరేటింగ్ చేస్తున్న సిబ్బందితో తాగునీటి ట్యాంకులు క్లోరినేషన్ చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. శిథిలావస్థకు చేరిన ట్యాంకులకు మరమ్మతులు చేయిస్తాం. **- భాస్కరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ**



బాధ్యతల స్వీకరణ

చాట్రాయి, న్యూస్‌టుడే: చాట్రాయి ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఐ.విజయలక్ష్మిని జిల్లా అధికారులు నియమించారు. ఇప్పటి వరకు ముసునూరు ఎంపీడీవో జి.రాణి ఇక్కడ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. చాట్రాయి ఇవోఆర్డీగా పనిచేస్తున్న విజయలక్ష్మికి అదనపు బాధ్యతలు అప్పగించగా బుధవారం ఆమె స్వీకరించారు.

తిరుమలకు కూరగాయల వితరణ

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం దగ్గర నుంచి పరిసర ప్రాంత రైతులు, దాతల సహకారంతో తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిత్యాన్నదానానికి కూరగాయలు బుధవారం వితరణగా అందించారు. కూరగాయలు సేకరించిన రైతు నక్క సత్యనారాయణ మాట్లాడుతూ.. పట్టణ పరిసర ప్రాంత రైతులు, దాతల సహకారంతో ప్రతి నెలా కూరగాయలు వితరణగా పంపుతున్నట్లు పేర్కొన్నారు.


వాహనం ముందు రైతులు

కృష్ణా జిల్లా సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక



నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని ధర్మ అప్పారావు కళాశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం ఉమ్మడి కృష్ణా జిల్లా సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక పోటీలు మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా కోచ్ డాక్టర్ వాకా నాగరాజు మాట్లాడుతూ.. ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 10, 11, 12 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

రాష్ట్రస్థాయికి.. ముసునూరు, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నూజివీడు డీఏఆర్ కళాశాలలో జరిగిన అండర్-14 బాల బాలికల విభాగంలో ముసునూరు మండలం రమణక్కపేట జడ్పీ పాఠశాలకు చెందిన టి.నాగసుధ, జి.జెస్సీ, డి.ఇందుప్రియ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు పసుమర్తి రామకృష్ణ, వాకా నాగరాజు బుధవారం తెలిపారు.


విద్యార్థినులతో వ్యాయామ ఉపాధ్యాయుడు

డ్రోన్ల వినియోగం ఉపయుక్తం



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి

నూజివీడు, న్యూస్‌టుడే: వ్యవసాయానికి సాంకేతికతను జోడించి డ్రోన్ల వినియోగంతో సమయం, ఖర్చు తగ్గించుకోవచ్చని, రైతులకు ఉపయుక్తంగా ఉంటాయని నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.బి.కనకమహాలక్ష్మి అన్నారు. బుధవారం నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం వారు సంయుక్తంగా వ్యవసాయ డ్రోన్లను వినియోగించి ఉద్యాన పంటల్లో వివిధ రకాల రసాయనాలు, పోషకాల పిచికారీపై నూజివీడు మండలంలో బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. మామిడి, అరటి, గుమ్మడి పంటల్లో పోషకాలు, పురుగు, తెగుళ్ల మందుల పిచికారీ చేసి క్షేత్రస్థాయిలో రైతులకు ప్రదర్శనలు నిర్వహించారు. శాస్త్రవేత్తలు జి.శాలిరాజు, ఎం.రాఘవేంద్రరెడ్డి, ఉద్యాన శాఖ అధికారిణి ఆర్.హేమ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామాల రూపకల్పనే లక్ష్యం


శిక్షణలో పాల్గొన్న ఉప సర్పంచులు, వార్డు సభ్యులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు సర్పంచి, పాలకవర్గ సభ్యులు ఆదర్శ గ్రామాల రూపకల్పనే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో బి.భార్గవి తెలిపారు. ఆగిరిపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏవో అబ్దుల్ సలాం, ఈవోపీఆర్డీ ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సృష్టి కార్యక్రమంపై దృష్టి సారించి పంచాయతీల ఆదాయ వనరులను పెంచుకునే లక్ష్యంగా పని చేయాలని పంచాయతీ రాజ్ ఏఈ కృష్ణ సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమన్వయకర్తలుగా రాంబాబు, నాగరాజు, నవ్య వ్యవహరించారు.

సాయిబాబా సేవలో కామినేని

కైకలూరు, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక శిర్డీ సాయి ధ్యాన మందిరంలో సాయిబాబా వారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ బుధవారం బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ కొణిజేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.


అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

నాయీబ్రాహ్మణులకు కేటాయించిన స్థలం పరిశీలన

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలో నాయీ బ్రాహ్మణులకు కేటాయించిన స్థలాన్ని జేసీ ధాత్రిరెడ్డి బుధవారం పరిశీలించారు. ద్వారకాతిరుమలలో ప్రభుత్వ భూమి ఎంత ఉంది, స్థలం కేటాయింపులో ఏమైనా ఇబ్బందులున్నాయా.. ఏ ప్రాతిపదికన కేటాయించారన్న అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జేవీ సుబ్బారావు, నాయీబ్రాహ్మణుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	జోకర్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	దేవర
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ద్వారక సినిమాస్ స్క్రీన్3	దక్షిణ
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	దేవర
కైకలూరు	
విజయలక్ష్మి జీవీ సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	స్వాగ్
శ్రీవెంకటరమణ సినిమాస్	దక్షిణ
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర

జూద స్థావరంపై దాడి

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: గొల్లపల్లి వేంపాడు అగ్రహారంలో జూద స్థావరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. గ్రామీణ ఎస్సై లక్ష్మణ్ వివరాల ప్రకారం.. గ్రామంలో జూద క్రీడలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. అయిదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి నాలుగు చరవాణులు, రూ.8,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పశు వైద్య భవనాలు శిథిలం

పిల్లర్లు బీటలు వారి.. శ్లాబులు కుంగి

ఇదీ పశువుల ఆసుపత్రుల పరిస్థితి

కలిదిండి, న్యూస్‌టుడే: మూగజీవాల సంరక్షణ ఒట్టి మాటగా మారుతోంది. వసతుల లేమితో పశువుల ఆసుపత్రులు వెలవెలబోతున్నాయి. కైకలూరులోని నాలుగు మండలాల్లోనూ అనేక చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరాయి. పిల్లర్లు బీటలు వారి.. శ్లాబులు కుంగిపోతున్నాయి. గోడల్లో మొక్కలు వేపుగా పెరుగుతున్నాయి. అయినా గత ప్రభుత్వ హయాంలో వీటిపై దృష్టి సారించలేదు. దీంతో ఏటికేడు పరిస్థితి దిగజారిపోయింది. కొన్నిచోట్ల వైద్యులు రావడానికి అయిష్టత చూపిస్తున్నారంటే పశువుల ఆసుపత్రుల నిర్వహణ ఏ స్థాయిలో ఉందో అవగతం అవుతోంది.

నియోజకవర్గంలో..	
ఆవులు	14 వేలు
గేదెలు	45 వేలు
మేకలు	55 వేలు
గొర్రెలు	18 వేలు

కూలడానికి సిద్ధంగా..

కలిదిండి మండలం సానారుద్రవరంలోని పశువుల ఆసుపత్రి కూలడానికి సిద్ధంగా ఉంది. దీనికి కనీసం మరమ్మతులు చేయడానికి కూడా ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు. గోడల మధ్య భాగంగా పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. చుట్టూ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. ఈ గ్రామంలో పాడిపై ఆధారపడి జీవించే కుటుంబాలు అత్యధికంగా ఉన్నాయి. సుమారుగా 500కి పైగా పాడి గేదెలు, ఆవులున్నాయి. వీటికి ఏదైనా అనారోగ్యం తలెత్తితే.. ఆసుపత్రిలో వసతులు లేక యజమానులు అవస్థలు పడుతున్నారు.

తాత్కాలిక షెడ్డు నిర్మించినా..

ముదినేపల్లి మండలం పెదగొన్నూరులో పశువుల ఆసుపత్రి పూర్తిగా శిథిలంగా మారింది. దానికి మరమ్మతులు చేయకపోవడం, కొత్త భవనం నిర్మించడానికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పశువుల యజమానులు స్వచ్ఛందంగా తాత్కాలికంగా షెడ్డు నిర్మించుకున్నారు. ఇక్కడి ఆసుపత్రికి సమీప గ్రామాల నుంచి పశువులు తీసుకొస్తుంటారు. ఇక్కడ విధులు నిర్వహించడానికి వైద్యులు ఆసక్తి చూపడం లేదు. ● ప్రొద్దువాక పశువుల ఆసుపత్రిలో భవనం సమస్య లేకపోయినా.. సరైన సదుపాయాలు లేవు. దీనివల్ల తగినంత స్థాయిలో పశువులకు సేవలు అందడం లేదు.


సానారుద్రవరం: శిథిలావస్థకు చేరిన భవనం

ప్రతిపాదనలు పంపాం..

కలిదిండి, కైకలూరు మండలాల్లోని సానారుద్రవరం, కోరుకొల్లు, సీతనపల్లి గ్రామాల్లో నూతన భవనాలు, కైకలూరు, పల్లెవాడ, భాస్కరరావుపేటలోని భవనాలకు మరమ్మతుల నిమిత్తం ప్రతిపాదనలు పంపించాం. వీటికి నిధులు మంజూరు కావాల్సి ఉందని కైకలూరు పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకుడు ముస్తఫా ఖాన్ వివరించారు.

చేతికందే ఎత్తులో ప్రమాదం!

ముసునూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు ప్రమాదాలు తరచూ జరుగుతున్నా.. అధికారుల్లో చలనం కనిపించడం లేదు. ముసునూరు మండలం రమణక్కపేట సెంటర్‌లో, చెక్కపల్లి రామాలయం వెనుక ఉన్న అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా విద్యుత్తు నియంత్రికల వద్ద ఫ్యూజ్ బాక్సులు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. కిందకు ఉండటంతో పాటు చిన్నారులకు సైతం అందే అంత ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాక్సులు నిత్యం తెరిచే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రమణక్కపేట సెంటర్‌లో ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్సు


చెక్కపల్లి రామాలయం వెనుక ఇలా..

సరస్వతీ నమస్తుభ్యం


మండవల్లి: అలంకరణలో అమ్మవారు


కోరుకొల్లులో..


అక్కిరెడ్డిగూడెంలో..


చాట్రాయిలో..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఏడో రోజు అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. భారీగా మహిళలు, విద్యార్థులు దర్శనానికి బారులుదీరారు. తల్లిదండ్రులు చిన్నారులు, విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో దాతలు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు **- న్యూస్‌టుడే, బృందం**


ఆగిరిపల్లిలో..


నూజివీడు: చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు


ముదినేపల్లిలో..

'పొలం పిలుస్తోంది'తో రైతులకు లాభాలు

ముసునూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ పథకం ద్వారా రైతులకు డ్రిప్, స్ప్రింకర్లు రాయితీపై అందిస్తున్నారని, కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల సహాయకులను సంప్రదించి రాయితీ పొందాలని మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. బుధవారం ముసునూరు మండలం లోపూడి, గోపవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్, సర్పంచి పేరం కృష్ణ, రాజానాయన తదితరులు పాల్గొన్నారు.


నూజివీడు: అవగాహన కల్పిస్తున్న అధికారులు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు మండలం పాత రావిచర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉద్యాన శాఖ అధికారిని ఆర్.హేమ మామిడి రైతులకు అవగాహన కల్పించారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు..

చాట్రాయి, న్యూస్‌టుడే: ఏవో బండారు శివశంకర్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించి వరి పంటను క్షేత్ర స్థాయి సందర్శనలో పరిశీలించారు. వీహెచ్‌ఏ జ్యోతి, తెదేపా నాయకులు చళ్లగుళ్ల రాజరత్నం, వెల్ది శేఖర్, ఎం.సుబ్రమణ్యం రైతులు పాల్గొన్నారు.

వివాహితను మోసం చేసిన యువకుడిపై కేసు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: స్నేహితుని భార్యను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా అనుభవించి, ఇప్పుడు తనకు పెళ్లి కుదిరిందని బయట ఎవరికీ సంబంధం విషయం చెప్పవద్దని బెదిరించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. మండలంలోని ఒక గ్రామానికి చెందిన నాగయ్య(24) అదే గ్రామానికి చెందిన స్నేహితుని భార్య(22)ను ప్రేమిస్తున్నానని ఏడాదిగా వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా కలిశారు. ఇటీవల యువకుడికి పెళ్లి కుదరడంతో తనను వదిలేయాలని బెదిరించడంతో మోసపోయానని తెలుసుకున్న వివాహిత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్సై వెంకటకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరబోతే అసలు సమస్య!

ధాన్యం కల్లాలు లేక అన్నదాతల అవస్థలు

చాట్రాయి, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలుకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. కోతలు మొదలయ్యే సమయానికి కేంద్రాలను సిద్ధం చేసే కసరత్తు మొదలైంది. కానీ రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు ఎక్కడా స్థలాలు కనిపించడం లేదు. మెట్ట ప్రాంతమైన నూజివీడు నియోజకవర్గంలో చాట్రాయి, ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి మండలాల పరిధిలో సుమారు 25,750 వేల ఎకరాలకు పైగా ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేపట్టారు. ఈ-పంట నమోదులో 22,732 ఎకరాలు నమోదైంది. ఏటా ధాన్యం విక్రయించే సమయంలో వర్షాలు వచ్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నోటి వరకు వచ్చిన పంట నీటి పాలవుతోంది. అదే పంట ఆరబెట్టుకునే విధంగా వసతి, దాచుకోవడానికి గోదాములు నిర్మిస్తే.. రైతులకు చాలా ఉపయుక్తంగా ఉంటుంది. గత ప్రభుత్వం పంట ఉత్పత్తులను నిల్వ చేసే వసతులపై దృష్టి సారించడంలో విఫలమవడంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు.


పోలవరం: లేఅవుట్లో ఆరబెట్టిన ధాన్యం (పాతచిత్రం)


ధాన్యం రాశులపై పట్టాలు కప్పుతున్న రైతులు(పాతచిత్రం)

నియోజకవర్గంలో ఇలా..		
మండలం	వరి సాగు	ఈ-పంట నమోదు
నూజివీడు	3,590	2,842
ముసునూరు	6,700	5,410
ఆగిరిపల్లి	4,560	3,980
చాట్రాయి	11,000	10,500

చినుకు పడితే కష్టాలే..

కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనాలంటే కనీసం మూడు నాలుగు రోజులు ఆరబెట్టాలి. తేమ శాతం ఎక్కువ ఉంటే మద్దతు ధర రాదు. ఖాళీ స్థలాల కొరతతో గ్రామాల్లో రహదారులు, లేఅవుట్లు ఇలా ఎక్కడ కనిపిస్తే అక్కడే రైతులు ధాన్యం ఆరబెట్టుకోవాల్సి వస్తోంది. వాతావరణం మారితే ఉరుకులు పరుగులు తప్పడంలేదు. ధాన్యం అమ్మే వరకు ఇంటిల్లాపాదికి కంటి మీద కునుకు ఉండదు. అంత కష్టపడినా.. మిల్లుకు వెళ్లిన తర్వాత ఇంకా తేమ ఉందని కొర్రీలు పెడుతూ కోత విధిస్తూ.. రైతులను అవస్థలు పెట్టిన ఘటనలు గత సీజన్‌లో అనేకం.